విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్
గుంటూరు, పల్నాడు

సోమవారం 23 డిసెంబరు 2024 8 పేజీలు

సీపీఐ శత వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్ కోటేశ్వరరావు పిలుపు

విశాలంధ్ర-విజయవాడ: దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో విప్లవాత్మకమైన పోరాటం, బ్రిటీష్ సామ్రాజ్యవాదులను తమిరికొట్టడంలో కీలకపాత్ర పోషిచించిన సీపీఐ 100వ వార్షికోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్ కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. గూడూరు శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన మైలవరం శ్రామిక భవనంలో సిపిఐ మైలవరం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలు సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కోటేశ్వరరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం శ్రామిక హక్కులు, దోపిడీ వ్యవస్థ నిర్మూలన, సమసమాజ స్థాపన కోసం అవిశ్రాంత పోరాటాలు నిర్వహించి ఎన్నో విజయాలు సాధించడం జరిగిందని గుర్తు చేశారు. ప్రపంచ కమ్యూనిట్టు ఉద్యమంలో మమేకమై 99సంత్సరాల పోరటాల ప్రస్థానం నుండి ఈ నెల 26తో 100వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న శుభ సందర్భంగా సీపీఐ శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1925 డిసెంబర్ 26న కాన్పూరులో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగాను, పీడిత ప్రజలకు అండగా, దున్నేవానికి భూమి కావాలని, జమీందారి విధానాల రద్దు, బ్యాంకులు జాతీయకరణం, ప్రైవేటీరంగాలను ప్రభుత్వరంగ సంస్థలుగా మార్చు వంటి అంశాలపై -మిగతా 2 లో ...

మూడు స్తంభాలాట!

శాఖల మధ్య సమన్వయ లోపం... ఆసుపత్రికి సమకూరని వసతులు

పట్టణ కేంద్రం దాచేపల్లిలో ఏడాది కితం దాదాపు రూ.కోటితో అర్బన్ హెల్త్ సెంటర్‌ను నిర్మించారు. అప్పట్లో హడావుడిగా నేతలు, అధికారులు ప్రారంభించారు. అయితే విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతి కల్పించలేదు. అయినప్పటికీ పీహెచ్‌సీ సిబ్బంది వచ్చి ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ అందుబాటులో ఉన్న మందులు ఇస్తున్నారు. ఈ విధంగా అరకొర వసతులు, సరిపడా లేని సిబ్బందితో ఏడాదికిపైగా నెట్టుకొచ్చారు. ఈ క్రమంలో ఈ ఆసుపత్రి ఒక్కసారిగా వార్తల్లోకి ఎక్కింది. విద్యుత్ సౌకర్యంతో పాటు తాగునీటి వసతి లేకపోవడంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించలేకపోతున్నామని పీహెచ్‌సీ అధికారులు వెల్లడించారు. పూర్తి స్థాయిలో సిబ్బంది లేనప్పటికీ ఒకరిద్దరు వెళ్లి ఆసుపత్రికి వచ్చిన రోగులకు మందులు ఇస్తున్నట్లు ప్రకటించారు.

విశాలాంధ్ర-దాచేపల్లి : పట్టణంలో ఉన్న ఈ ఆసుపత్రికి విద్యుత్ మీటరు సహా తదితర సౌకర్యాలు నగర పంచాయతీ అధికారులు కల్పించాలని వైద్యాధికారులు చెబుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు మాట్లాడుతూ నగర పంచాయతీ నుంచి డబ్బు చెల్లించలేదు కాబట్టి మీటరు బిగించలేదని పేర్కొన్నారు. దీనిపై నగర పంచాయతీ అధికారులు మాట్లాడుతూ విద్యుత్ శాఖ నుంచి అంచనా వ్యయం రాలేదన్నారు. ఇప్పటికైనా పంపితే నగదు కడతామని తెలిపారు. ఈ విధంగా శాఖల మధ్య సమన్వయ లోపంతో ఒకరిపై మరొకరు నిందారోపణలు చేసుకుంటూ ఏడాది గడిపారు. కారణాలేమైనప్పటికీ నిరుపేద ప్రజలకు వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందలేదనేది వాస్తవం. అదే ముందుగా గుర్తించి ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి నట్లయితే ఈ పరిస్థితి వచ్చేది కాదేమో. ఏది ఏమైనప్పటికీ మీడియా పుణ్యమా అని మూడు శాఖల అధికారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. దాంతో ముగ్గురూ స్పందించడంతో అందులో సమస్యలు వెలుగు చూశాయి. ప్రజలకు వాస్తవాలు తెలిశాయి. ఇప్పటికైనా ఎవరి పనులు వారు చేసి ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించాలని పట్టణ ప్రజలు -మిగతా 2 లో ...

ఇంద్రకీలాద్రిపై ఆధ్యాత్మిక పరిమళాలు

-రెండో రోజు వైభవోపేతంగా భవానీ దీక్షా విరమణలు -ఏర్పాట్లు పరిశీలించిన హోంశాఖ మంత్రి అనిత

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ఇంద్రకీలాద్రి ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో భవాని దీక్షా విరమణలు రెండో రోజు ఆధ్యాత్మిక పరిమళాల మధ్య ఘనంగా జరుగుతున్నాయి. వేకువజామున 3గంటల నుంచే వేలాది మంది భవానీలు గిరి ప్రదక్షిణ చేసుకొని అనంతరం అమ్మవారిని దర్శించుకొని, మాల విరమణ చేశారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత మోడల్ గెస్ట్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రం(ఐసీసీసీ) కార్యకలాపాలను ఆదివారం పరిశీలించారు. భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా అప్రమత్తతతో వ్యవహరించాలని అధికా రులు, సిబ్బందికి మంత్రి సూచించారు. జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు, డీసీపీ గౌతమి శాలి తదితరులతో -మిగతా 2 లో ...

చిన్నకాకాని రాజకమల్ రోడ్‌లో అండర్ పాస్ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-మంగళగిరి : విజయవాడ పశ్చిమ బైపాస్ రోడ్డు నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో చిన్నకాకాని, నిడ మర్రు, కంతేరు, గ్రామాల ప్రజలు రైతులు వివిధ కంపెనీలలో పనిచేయు కార్మికులు, వ్యవ సాయ కార్మికులు నిరంతరం వారి వారి పనుల నిమిత్తం చిన్నకాకాని రాజ్ కమల్ రోడ్డు ద్వారా -మిగతా 2 లో ...

సీపీఐ శత వార్షికోత్సవాన్ని జయప్రదం చేయండి

-మధ్యాహ్నం 3 గంటలకు రెడ్‌షర్ట్ వలంటీర్ల కవాతు, బహిరంగ సభకి తరలిరండి

-సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: భారత కమ్యూ నిస్టు పార్టీ 99 వసంతాలు పూర్తి చేసుకుని 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా సీపీఐ విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో డిసెంబరు 26వ తేదిన నిర్వహించే సీపీఐ శత వార్షికోత్సవంలో -మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

సిపిఐ శత వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

సిపిఐ అనుబంధా సంఘాలతో కలిసి పోరాడి విజయాలు సాధించడం జరిగిందన్నారు. ఎంతో ఘన చరిత్ర ఉన్న సీపీఐ శతాబ్ది ఉత్సవాలను వైబోపేతంగా నిర్వహించాలని కోరారు. తొలుత సీపీఐ నియోజకర్గ కార్యదర్శి, జిల్లా సహాయకార్యదర్శి బుడ్డి రమేష్ ఎజెండాను ప్రవేశపెట్టి గత కార్యక్రమాలను, భవిష్యత్తు అంశాలను వివరించారు. ఈ సమావేశంలో ఎన్జీఆర్‌జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సిహెచ్ దుర్గా కోటేశ్వరరావు, నియోజకర్గ నాయకులు కన్నా వెంకటేశ్వరరావు, పెన్నుబోయిన చిన నరసింహరావు, పెండెం కోటేశ్వరరావు, టి జమలయ్య, కె రత్నకుమారి, యం లక్ష్మి పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై ఆధ్యాత్మిక పరిమళాలు

కలిసి ఐసీసీసీ నుంచి పర్యవేక్షించారు. సీసీటీవీలు, డ్రోన్ విజువల్స్ ద్వారా నిరీక్షణ పాయింట్లతో పాటు పార్కింగ్, క్యూలైన్లు, ఘాట్లు, దర్శనం, ప్రసాదం కౌంటర్లు, హోమ గుండాలు, గిరి ప్రదక్షిణ, అన్న ప్రసాదం పంపిణీ పాయింట్ల వద్ద రద్దీని, భక్తులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. చిన్నారులు తప్పిపోతే వారి జాడను వెంటనే తెలుసుకునేందుకు ఈసారి దుర్గమ్మ ఆలయం అందుబాటులోకి తెచ్చిన చైల్డ్ మానిటరింగ్ సిస్టమ్(సీఎంఎస్)పై యాత్రికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తొలిరోజు రాత్రి 11 గంటలు సమయానికి 1,960 మంది చిన్నారులకు క్యూఆర్ కోడ్ ట్యాగ్‌లు వేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు, భక్తుల భద్రతకు పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు, నిఘా ఏర్పాటు చేసింది. అంతకంతకు భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగా క్షేత్రస్థాయి బృందాలను ప్రత్యేక కమ్యూనికేషన్ వ్యవస్థ ద్వారా అప్రమత్తం చేస్తున్నారు. అన్ని లైన్లలో ఉచిత దర్శన సౌకర్యాన్ని భక్తులు ఉపయోగించుకుంటున్నారు. అత్యంత ముఖ్యమైన పారిశుధ్యం, తాగునీరు తదితర ఏర్పాట్లను నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర, విజయవాడ ఆర్డీఓ కావూరి చైతన్య, ఆలయ ఈవో కేఎస్.రామరావు తదితరులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

మూడు స్తంభాలాట!

కోరుతున్నారు. విద్యుత్, తాగునీటితో సహా ఇంకేమైనా ఇబ్బందులు ఉన్నాయేమో మూడు శాఖల అధికారులు సమన్వయంతో పరిశీలించి వాటిని పరిష్కరిస్తే మెరుగైన వైద్య సేవలు అందుతాయని ప్రజలు ఆశిస్తున్నారు. అందులో డాక్టర్ సహా సిబ్బందిని కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

చిన్నకాకాని రాజకమల్ రోడ్‌లో అండర్ పాస్ ఏర్పాటు చేయాలి

వెళ్లి వారి విధులు పనులు చేసుకుంటారు. ఈ నేపథ్యంలో అక్కడ అండర్ పాస్ ఏర్పాటు చేయాలని కోరుతూ గుంటూరులోని ఆయన కార్యాలయంలో కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసి వినతిపత్రాన్ని మన్యం శ్రీనివాసరావు, పొన్నెకంటి కొండలరావు, పోతినేని వెంకటేశ్వరరావు అందించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విజయవాడ పశ్చిమ బైపాస్ రోడ్డు నిర్మాణం రాజ్ కమల్ రోడ్ మీదగా వెళ్తున్నందున ఈ రోడ్డుకు అండర్ పాస్ ఇవ్వడం వలన భవిష్యత్తులో గ్రామ ప్రజలు, రైతులు మీద కంపెనీల వారు వెళ్ళటానికి వీలుగా ఉంటుంది లేనిపక్షంలో పనుల నిమిత్తం పొలాలకు వెళ్ళటానికి కానీ కంపెనీ పనులకు వెళ్లే వారికి తీవ్రమైన అసౌకర్యం కలుగుతుందన్నారు. మూడు గ్రామాల ప్రజలు రైతులు ఆవేదన చెందుతూ కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు వినతిపత్రాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు. గతంలో అనేకసార్లు నేషనల్ హైవే అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా కానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని వారు ఆయనకు తెలియజేశారు. అందువలన మూడు గ్రామాల ప్రజల సమస్యను గుర్తించి ఆ రోడ్డులో అండర్ పాస్ మంజూరు చేయించి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

వామపక్షాలతోనే సింగ్‌నగర్ అభివృద్ధి

-మరో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి పోరాటం సిద్ధం కావాలి : సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు -సీపీఐ 62వ డివిజన్ కార్యాలయం పునఃప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ: వామపక్ష పార్టీలు అధికారంలో ఉన్నప్పుడే ప్రధాన నగరంతో పాటు శివారు ప్రాంతాలు కూడా అభివృద్ధి జరిగిందని, కమ్యూనిస్టు పార్టీ ప్రజాప్రతినిధుల కృషితోనే సింగ్‌నగర్ అభివృద్ధి చెందిందని సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. ఇటీవల వరదలతో ధ్వంసం కావటంతో పున:నిర్మాణం చేసిన పార్టీ 62వ డివిజన్ కార్యాలయం చలసాని భవన్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రకాష్‌నగర్‌లో సీపీఐ 62వ డివిజన్ కార్యదర్శి లింగాబత్తిన శివకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో కోటేశ్వరరావు మాట్లాడుతూ నగరపాలక సంస్థలో మేయర్ టి.వెంకటేశ్వరరావు సారథ్యంలో కమ్యూనిస్టు పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలపై భారాలు వేయకుండా పాలన సాగించినట్లు గుర్తు చేశారు. నేటి పాలకులు చెత్తపై పన్ను విధిస్తే దానికి వ్యతిరేకంగా పోరాటం చేసి విజయం సాధించినట్లు చెప్పారు. సీపీఐ సీనియర్ నేత కె.సుబ్బరాజు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సింగ్‌నగర్ ఫ్లైఓవర్ నిర్మాణం జరిగిందన్నారు. నేటి అవసరాలకు ఏమాత్రం సరిపోని కారణంగా మరో ఫ్లైఓర్ బ్రిడ్జి నిర్మాణం జరిగేందుకు సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అధికార పార్టీ నేతల తాబేదార్లుకు అవకాశం కల్పించటం, అధికారుల అలసత్వం కారణంగా బుడమేరు కట్ట ఆక్రమణకు గురైయిందన్నారు. నగరంలోని 32 డివిజన్‌లు ముఖ్యంగా సింగ్‌నగర్, ప్రకాష్‌నగర్, కండ్రిక ప్రాంతాలు ముంపు బారిన పడ్డాయన్నారు. వరదలతో నష్టపోయన చిరువ్యాపారులకు న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సారథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిసి మాట్లాడటం జరిగిందన్నారు. ప్రజాసమస్యలపై పోరాటాలు చేసే కమ్యూనిస్టు పార్టీ శత వసంతంలోకి అడుగిడుతున్న నేపథ్యంలో ఈ నెల 26న జరిగే ప్రదర్శన, బహిరంగ సభలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరరావు మాట్లాడుతూ పార్టీ అగ్రనేతలు సురవరం సుధాకర్ రెడ్డి, కె.సుబ్బరాజు, నాసర్‌వలి తదితర నాయకులు సందర్శించిన ఈ కార్యాలయం చలసాని భవన్‌ను పున:నిర్మించటం జరిగిందన్నారు. ప్రజలకు ఎల్లపుడూ అండగా ఉండేది వామపక్ష పార్టీలేనని స్పష్టం చేశారు. ముందు అరుణపతాకాన్ని జి.కోటేశ్వరరావు ఆవిష్కరించారు. ఏఐటీయూసీ జెండాలని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు ఎగురవేశారు. చలసాని వెంకట రత్నం విగ్రహానికి నక్కా వీరభద్రరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకులు ఎస్‌కె.నజీర్ అభ్యుదయ గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శివర్గ సభ్యులు పంచదార్ల దుర్గాంబ, కేవీ భాస్కరరావు, 62వ డివిజన్ సహాయ కార్యదర్శి పి.పెదలక్ష్మయ్య. భవన నిర్మాణ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షుడు చినలక్ష్మయ్య, సీనియర్ నాయకులు డి.పుష్పావతి, ఎ.వెంకట రామయ్య తదితరులు పాల్గొన్నారు.

26న జరిగే సీపీఐ శత వార్షికోత్సవాన్ని జయప్రదం చేయండి

పార్టీ శ్రేణు లతో పాటు ప్రజలు భాగస్వాములైన జయప్రదం చేయాలని సీపీఐ విజయవాడ నగర సమితి కార్యదర్శి జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక దాసరి భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం మధ్యాహ్నం 3 గంటలకు తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి లెనిన్ సెంటర్ వరకు రెడ్‌షర్ట్ వలంటీర్ల కవాతు ఉంటుందని, అనంతరం 4 గంటలకు లెనిన్ సెంటర్‌లో బహిరంగ సభ జరుగుతుందున్నారు. ఈ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని పాల్గొంటారని తెలిపారు. ఈ దేశానికి స్వేచ్ఛా, సంపూర్ణ స్వతంత్రాలు కావాలని బ్రిటిష్ సామ్రాజ్య వాదులపై పోరాటం చేసి దేశ స్వతంత్ర కోసం పోరాడిన భారత కమ్యూనిస్టు పార్టీ 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని 100 సంవత్సరంలో అడుగుపెడుతున్నందుకు తమకు ఎంతో గర్వకారణంగా అన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ దేశవ్యాప్తంగా శత వార్షికోత్సవానికి శ్రీకారం చుట్టిందన్నారు. దేశానికి స్వాతంత్ర్యంతో వచ్చిన తర్వాత కూడా అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించి వివిధ ప్రాంతాల్లో అణగారిని వర్గాలకు అండగా ఉంటూ భూమి కోసం... భుక్తి కోసం.. పేద ప్రజల కోసం విముక్తి కోసం...అనేక ఉద్యమాలు చేసి లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేసిన చరిత్ర సీపీఐకి ఉందన్నారు. ప్రత్యేకంగా తెలుగు గడ్డపై తెలంగాణ సాయుధ పోరాటం ద్వారా 'బాంచన్ నీ కాలు మొక్కుతా..' అనే లక్షలాది మంది పీడిత ప్రజలకు విముక్తి కలిగించిందన్నారు. ఆ పోరాటంలో 4,000 మంది తమ ప్రాణాలను అర్పించారని చెప్పారు. భారతదేశంలో, తెలుగు రాష్ట్రాలలో కమ్యూనిస్టు పార్టీకి ఘనమైన చరిత్ర ఉందన్నారు. ఈ తరుణంలో రాబోయే కాలంలో దేశంలోని సహజ వనరులను కార్పొరేట్ శక్తులకి అమ్మేస్తున్న బీజేపీ విధానాల్ని నిరసిస్తూ దేశ సంపదని పరిరక్షించుకునేందుకు కమ్యూనిస్టు పార్టీ ప్రజల పక్షాన భవిష్యత్ ఉద్యమానికి శ్రీకారం చుడుతుందన్నారు. చరిత్రలో అనేకమంది పేద ప్రజలకి తన సహాయాన్ని అందించిన కమ్యూనిస్టు పార్టీ రాబోయే కాలంలో పార్లమెంటు, అసెంబ్లీలో ప్రజల పక్షాన కూడా నిలబడి పోరాటం చేసే అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ విజయవాడ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, కార్యదర్శివర్గ సభ్యులు బుట్టి రాయప్ప, తాడి పైడియ్య, మూలి సాంబశివరావు, కేవీ భాస్కరరావు, పంచదార్ల దుర్గాంబ, అప్పురబోతు రాము, కొట్టు రామణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ప్రణవి చిత్ర గీతాల వారోత్సవం ప్రారంభం



విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : ఎన్టీఆర్ ప్రణవి మ్యూజికల్ అకాడమీ సాంస్కృతిక సామాజిక సేవా సంఘం 6వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 22వ తేదీ నుంచి 28వ తేదీ వరకు కౌతా పూర్ణానందం, హనుమంతరాయ గ్రంథాలయం కళావేదికలపై నిర్వహిస్తున్న చిత్ర గీతాల వారోత్సవం ఆదివారం ప్రారంభమైంది. ప్రణవి అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు కారుమంచి రాజు నేతృత్వంలో దూరదర్శన్ మేకప్ మాన్ రాయ రాజు పర్యవేక్షించారు.

కన్నులపండువగా సీతారాముల కళ్యాణం

విశాలాంధ్ర-విజయవాడ: విష్ణు సహస్రనామ పారాయణ మండలి 14వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక పూర్ణానందపేట శ్రీ శ్రీరామచంద్ర దాశాంజనేయ స్వామి వార్ల ఆలయ ప్రాంగణంలో శ్రీ సీతారామస్వామి వార్ల కళ్యాణం కన్నులపండువగా జరిగింది. సకల జనులకు సౌఖ్య జీవనం ప్రసాదించబడాలని ఈ కళ్యాణాన్ని నిర్వహించినట్లు ఆలయ ట్రస్టీ కన్వీనర్ వేముల హజరత్తయ్య గుప్తా తెలిపారు.

నైతిక విలువలకు నిలువుటద్దం మానికొండ



విశాలాంధ్ర-విజయవాడ: నైతిక విలువలకు నిలువుటద్దం మానికొండ చలపతిరావు అని పలువురు వక్తలు అన్నారు. శ్రీ మిర్యాల వెంకట్రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారతీయ జర్నలిజం ధృవతార మానికొండ చలపతిరావు పుస్తకావిష్కరణ సభ అత్యంత వైభవంగా జరిగింది. ఆదివారం యూసఫ్ గూఢ లోని మహమ్మద్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మేఘాలయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కొట్టు శేఖర్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని రచయిత, సీనియర్ జర్నలిస్ట్ ఆకుల అమరయ్య ఇతర జర్నలిస్టులు చందుజనార్ధన్, రామమోహన నాయుడు, సమ్మెట నాగమల్లేశ్వరరావు తదితరులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత అమరయ్య మాట్లాడుతూ జర్నలిజంలో నైతికత విలువలకు కట్టుబడిన భారతీయ జర్నలిస్టులలో మానికొండ చలపతిరావు ఒకరని కొనియాడారు. భారతీయ వర్ధమాన జర్నలిస్టులకు తెలుగులో వచ్చిన ఏకైక పుస్తకం ఎంతో ఉపయోగిపపడుతుందని చెప్పారు. మానికొండ చలపతిరావు జీవిత చరిత్ర, జర్నలిజం విలువల గురించి ప్రముఖులు అనేకమంది రాసిన దాదాపు 30 వ్యాసాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. ఈ సభకు ఆంధ్రప్రదేశ్ సామాజిక న్యాయ విశ్లేషకులు కటారి అప్పారావు, అరవ రామకృష్ణ, మాజీ ఐఏఎస్ ఆఫీసర్ తోట గోపాలకృష్ణ, సీనియర్ జర్నలిస్టులు పాశం యాదగిరి రామ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. పుస్తకావిష్కరణ అనంతరం మానికొండ చలపతి పుస్తకం రాసిన రచయిత ఆకుల అమరయ్యను సన్మానించారు.

టైరు పేలి టమాటా లారీ బోల్తా

విశాలాంధ్ర-చల్లపల్లి : టమాటా లోడుతో వెళుతున్న మినీ లారీ టైరు పేలటంతో చల్లపల్లిలో జాతీయ రహదారిపై పల్టీకొట్టింది. గంగులవారిపాలెం సమీపంలో హైవేపై శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ సంఘటన చోటు చేసుకుంది. టమాటా లోడు వాహనం అనంతపురం నుంచీ భీమవరం వెళుతోంది. లారీ పల్టీకొట్టడంతో టమాలా ట్రేలన్నీ రోడ్డుపై పడిపోయాయి. అదృష్టవశాత్తూ డ్రైవర్, క్లీనర్లకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. హైవేపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా హైవే పెట్రోలింగ్ సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకున్నారు. టమాటా ట్రేలను తిరిగి లోడు చేసుకుని, చెల్లాచెదురైన కొంత లోడును మాత్రం వదిలేసి వెళ్లిపోయారు. దీంతో ఉదయం స్థానికులు ట్రేలు తీసుకువచ్చి టమాటాలు తీసుకువెళ్లారు.

జాతీయ గణిత దినోత్సవం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ హై స్కూల్లో ఆదివారం లెక్కల మాస్టారు మేకా రాణి ఆధ్వర్యంలోగణిత విభాగం పర్యవేక్షణలో శ్రీనివాస రామానుజన్ 137వజయంతి సందర్భంగా జాతీయగణితదినోత్సవం నిర్వహించారు. పలు తరగతుల విద్యార్థిని విద్యార్థులు రూపొందించిన రామానుజన్ పోస్టర్ ప్రజెంటేషన్‌లో 70 కి పైగాఎగ్జిబిట్స్ ప్రదర్శించారు. దీని సందర్భంగా నే శనివారం పాఠశాలలో రంగవల్లుల పోటీలు గణిత మెజీషియన్. శ్రీనివాస రామానుజన్ పైవ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు పసుపులేటి శివ కోటేశ్వరరావు, గణిత ఉపాధ్యాయులు.మేకారాణి, కే ఎన్ వీడి రాంబాబు, పి గోవిందరాజులు, కే ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో ఒకరి మృతి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండగా గుర్తించినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ పి.పార్ధసారధి తెలిపారు. అదివారం ఆయన తెలిపిన వివరాలు ప్రకారం రైల్వేస్టేషన్‌లోని 6వ నెంబర్ ప్లాట్‌ఫామ్ సౌత్‌సైడ్ సిమెంట్ అరుగుపై గుర్తు తెలియని వ్యక్తి(40) మృతి చెంది ఉండగా గుర్తించామన్నారు. మృతుడు ఎత్తు 5.6తో నలుపు రంగు కలిగి లావుగా ఉన్నాడు.శరీరంపై నలుపు,లేత ఎరుపు రంగు ఫుల్‌హ్యాండ్ షర్టు, ఎరుపు రంగు నిక్కరు ధరించి ఉన్నాడు. జేబులో అదివారం తెల్లవారుజామున గుడివాడ నుండి సికింద్రాబాద్ వెళ్ళటానికి సూపర్‌పాస్ట్ రైలు టిక్కెట్ ఉంది.అలాగే ఎడమ చేయిఐ వి.ఆర్.ఆర్.,కుడి చేయిపై డాడీ అని ఇంగ్లీషు పేర్లు చ్చబోట్లు ఉన్నాయి. అనారోగ్యంతో మృతి చెందినట్లు అనుమానిస్తున్నా మన్నారు. ఇంతకు మించి వివరాలు,అధారాలు లభ్యం కాలేదు. వివరాలు తెలిస్తే రైల్వే పోలీస్‌స్టేషన్‌లో గాని 88971 56153, 9440627544లో సంప్రదించాలని కోరారు.

భవానీలకు సేవ చేయడం వరం : సీఐ కొండలరావు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భవానీ భక్తులకు సేవ చేయడం ఒక వరమని టూటౌన్ పోలీస్ స్టేషన్ సీఐ కొండలరావు అన్నారు. ఆదివారం విజయ పాల ఫ్యాక్టరీ సమీపంలోని శ్రీ విజయ దుర్గా రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానం మెట్ల వద్ద అస్త్ర అపార్ట్‌మెంట్ వాసులు వేముల సుబ్బారావు, బాల రాధ దంపతులు ఆధ్వర్యంలో భవానీ భక్తులకు పండ్లు, పులిహోర, యాపిల్స్, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ దీక్ష విరమణ సందర్భంగా గిరి ప్రదక్షిణ చేస్తున్న భవానీలకు తన చేతుల మీదుగా పండ్లు పంపిణీ చేయడం వరం వంటిందన్నారు. భక్తి శ్రద్ధలతో గిరిప్రదక్షిణ చేస్తున్న భవానీలకు సేవ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు చింతలపాటి పవన్ కుమార్, వేముల కృష్ణకార్తీక్, సీనియర్ జర్నలిస్టు వెంకట రమణ, అపార్ట్‌మెంట్ వాసులు బీ.శ్రీనివాసులు, బి.రవికుమార్, బి.బ్రహ్మానందం, జి.వెంటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భవానీల దుస్తులను శుభ్రపరచండి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : కన్వేయర్ బెల్ట్ ద్వారా భవాని దుస్తులను ఎప్పటికప్పుడు తీసేలా చూసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగరంలో జరుగుతున్న భవాని దీక్షల విరమణ సందర్భంగా కమిషనర్ ఆదివారం వినాయకుని గుడి, సీతమ్మవారి పాదాలు, కృష్ణవేణి ఘాట్, కేశఖండనశాల, కంట్రోల్ రూమ్, బబ్బురి గ్రౌండ్స్, పున్నమిఘాట్, కుమ్మరిపాలెం సెంటర్, గిరి ప్రదక్షణ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ పర్యటనలో అమ్మవారి భక్తులకు త్రాగునీటి సరఫరా, స్నానాలకు నీటి సరఫరా, పారిశుధ్య, మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి భక్తులు ఎక్కువ సంఖ్యలో ఉండటంతో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, యాత్రికులకు తాగునీటి కొరత లేకుండా ఎప్పటికప్పుడు స్టాక్‌ను చూసుకుంటూ ఉండాలన్నారు. భవాని విరమణ దీక్షలకు గిరి ప్రదక్షిణ చేసే భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా గిరిప్రదక్షణ ఉన్న ప్రాంతం మొత్తం పారిశుధ్య నిర్వహణలో లోపం లేకుండా చిన్నచిన్న రాళ్ళను సైతం తీసేసి పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. గిరిప్రదక్షిణ దారిలో భక్తులకు మరుగుదొడ్ల సౌకర్యాన్ని మరిన్ని పెంచాలని, కొన్ని మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. దీక్షల్లో భవాని భక్తుల వదిలే దుస్తులను ఎప్పటికప్పుడు తీసేసి కన్వేయర్ బెల్ట్ ద్వారా తొలిగించాలని, అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ సిబ్బందిని పర్యవేక్షిస్తుండాలన్నారు. యాత్రికులకు ఏర్పాటు చేసిన సామాన్లు, చెప్పులు భద్రపర్చే స్టాండ్లను అందుబాటులో ఉన్నాయని భక్తుల నుండి చార్జి వసూలు చేయటంలేదని భక్తులకు తెలిసేలా మైక్ ద్వారా తెలపాలని ఆదేశించారు. ఈ పర్యటనలో అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్, సీఈ శ్రీనాథ్, ఇన్‌చార్జి సీఎంవోహెచ్ డా.సురేష్‌బాబు, ఎస్ఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

డీసీఎంకు రైల్ సేవా పురస్కారం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : భారత రైల్వేలలో అత్యున్నత గౌరవం అయిన అతి విశిష్ట రైల్ సేవా పురస్కార్ అవార్డును విజయవాడ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వావిలపల్లి రాంబాబు ఢిల్లీలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ చేతుల మీదుగా అందుకున్నారు.శనివారం ప్రగతి మైదాన్‌లోని భారత్ మండపంలో జరిగిన 69వ రైల్వే వీక్ సెంట్రల్ కార్యక్రమంలోఅత్యంత ప్రతిష్టాత్మకమైన రైల్వే బోర్డు అవార్డు అయిన అతి విశిష్ట రైల్ సేవా పురస్కార్‌ను రాంబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనందంగా ఉందని ఈ అవార్డు ద్వారా మరింత బాధ్యత పెరిగిందన్నారు. ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించటం, రైల్వే ఆదాయం పెంచే విధంగా తన తోటి సిబ్బందితో కృషి చేయటం వలనే సాధ్యమైందన్నారు. భవిష్యత్తులో రైల్వే సరంగా మరింత అభివృద్ధికి తనవంతా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.2022-23,2023-24 ఆర్థిక సంవత్సరంలో వరుసగా రెండు సంవత్సరాలు రూ. 5000 కోట్ల మార్కును అధిగమించి, విజయవాడ డివిజన్ దక్షిణ మధ్య రైల్వే అత్యధిక ఆదాయాన్ని సాధించడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు.డివిజన్ చరిత్రలో తొలిసారిగా సరుకు రవాణా ఆదాయం రూ. 4000 కోట్ల మార్కును అధిగమించింది. ఆయన వ్యూహాత్మక దృష్టి, వినూత్న విధానం,అవిశ్రాంత ప్రయత్నాలు ఆదాయ వృద్ధిని గణనీయంగా పెంచాయి, వాణిజ్య శ్రేష్ఠతకు కొత్త ప్రమాణాలను నిర్దేశించాయి. ఆయన చేసిన అద్భుతమైన ప్రయత్నాల ఫలితంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన రూ. 4.6 కోట్ల కంటే 50% పెరుగుదలను నమోదు చేయడం ద్వారా ఛార్జీయేతర ఆదాయం ద్వారా డివిజన్‌కు రూ. 6.9 కోట్లు సమకూరింది. ఆయన నిరంతర కృషి ద్వారా మరియు స్థానిక వ్యాపార అభివృద్ధి యూనిట్ బృందాలతో సమన్వయంతో, ఈ రెండు సంవత్సరాలలో అనేక కొత్త ట్రాఫిక్ మార్గాలను ఉపయోగించుకున్నారు. ఆయన పర్యవేక్షణలో, ఏప్రిల్ 2024లో అత్యధికంగా రూ.7.96 కోట్ల టిక్కెట్ల తనిఖీ ఆదాయం లభించింది.ఈ ఏడాది సెప్టెంబర్‌లో బుడమేరు ఆకస్మిక వరదల సమయంలో మరో రెండు రైళ్లలో చిక్కుకున్న దాదాపు 2700 మంది ప్రయాణికుల పునరుద్ధరణ,సహాయ కార్యకలాపాలను పర్యవేక్షించారని అధికారులు కొనియాడారు.

భక్తులతో కిక్కిరిసిన పైడమ్మ తల్లి ఆలయం

విశాలాంధ్ర-పెడన: పెడనలో పైడమ్మ తల్లి దేవాలయానికి భక్తుల తాకిడి పెరగడంతో ఆలయ ప్రాంగణం జన సందోహంతో కిక్కిరిసింది. అమ్మవారి జాతర మహోత్సవాలు తొమ్మిదో రోజు ఆదివారం అవడంతో భారీగా ఆలయానికి పోటెత్తిన భక్తులు అమ్మవారి దర్శనార్థమై బారులు తీరిన భక్తులు అంగరంగ వైభవంగా జరుగుతున్న ఈ జాతర మహోత్సవానికి మధ్యాహ్నం మూడు గంటలకు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో తిక్కిశెట్టివీర వెంకట మోహన్ రావు తెలిపారు.

హెల్మెట్ ధరించాలి

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నగరంలో హెల్మెట్, పెండింగ్ చనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని తద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. హెల్మెట్ ధరించకపోవడంతో చాలా మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించి నడపటం వలన ఒక రక్షణ కవచంలా ఉపయోగపడుతుందని తెలిపారు. హెల్మెట్ వాడకం వలన కలిగే ప్రయోజనాలను వాహనదారులకు వివరించారు. పెండింగ్‌లో ఉన్న చలానాలను తమ ఫోన్‌లోనే చెల్లించాలని సూచించారు. హెల్మెట్ ధరించకపోవతే జరిమానాలతో పాటు వాహనాలను సీజ్ చేయడం జరుగుతోందన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో హెల్మెట్ ధరించని 493 మంది నుంచి రూ.1,83,055 జరిమానా చెల్లించారు. ప్రతి ఒక్కరూ హల్మెట్ ధరించాలని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

విశాలాంధ్ర-విజయవాడ: సూర్యారావుపేట సెక్షన్, సీతారామపురం సబ్ స్టేషన్, 11 కేవీ సత్యసాయి ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మత్తులు, నిర్వహణ నిమిత్తం సోమవారం ఉదయం 8 నుండి 10.00 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ కార్యనిర్వాహక ఇంజనీర్‌పి. రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరా నిలుపు ప్రదేశాలు: సీతారామపురం రైవస్ కాలువగట్టు, మల్లెల శ్రీరామమూర్తి వీధి, కొల్లిపర వారి వీధి, వీరమాచినేని రంగారావు వీధి, వారణాసి వారి వీధి, ఐనవోలు వారి వీధి ఏలూరురోడ్డు సీతారామపురం సిగ్నల్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఆపబడునని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాలలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

APCOB

ది ఆంధ్రప్రదేశ్ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్

(గవర్నమెంట్ పార్ట్‌నర్డ్ షెడ్యూల్డ్ బ్యాంక్)

27-29-28, ఎన్.టి.ఆర్. సహకార భవన్, గవర్నర్ పేట, విజయవాడ-520002.

ఫోన్ నెం.0866-2429061

బంగారు నగల వేలం నోటీసు

ఈ దిగువ పట్టికలో పేర్కొనబడిన వ్యక్తి మా వద్ద బంగారు నగలు తాకట్టు పెట్టి అప్పు తీసుకొనియున్నారు. సదరు బాకీలు సకాలంలో చెల్లించనందున వాటి బకాయిలు పూర్తిగా చెల్లించి నగలు విడిపించుకొనవలసిందిగా మా వద్ద గల వారి చిరునామాలకు పలుమార్లు నోటీసులు పంపించినాము. సదరు బకాయిలు చెల్లించనందున **తేది.30.12.2024 (సోమవారం) సాయంత్రం 04.00 గం.లకు మా బ్యాంకు (ప్రధాన కార్యాలయ)** ఆవరణలో మా వద్ద తాకట్టులో ఉన్న బంగారు ఆభరణములను వేలం వేసి బకాయిలను జమచేయబడును. ఇంకనూ ఏమైనా బాకీ మిగిలి ఉన్నయెడల చట్టరీత్యా బాకీదారుల నుండి వసూలు చేయబడును. ఆసక్తి ఉన్న వారు వేలములో పాల్గొనవచ్చును. వేలములో పాల్గొనువారు రూ.10 వేలు **(E.M.D)** ధరావత్తు సొమ్ము కట్టవలెను. ఎట్టి కారణము చూపకనే వేలమును నిలిపివేయుటకుగాని, వేలములో ఎక్కువ ధరకు పాడిన ధరను **(Highest Bid)** ఆఫరు తిరస్కరించుటకుగాని సర్వహక్కులు బ్యాంకు వారికి ఉన్నవి. వేలములో వస్తువులు పాడుకున్నవారు నగదు వెంటనే చెల్లించవలెను. మరింత సమాచారం కొరకు **AGM (BRCC), APCOB** వారిని సంప్రదించగలరు.

మొగల్రాజపురం బ్రాంచ్

లోన్ ఖాతా నెంలు.	ఖాతాదారుని పేర్లు & చిరునామా	మొత్తము బరువు గ్రా॥లు
110001404679	శ్రీ టి.హేమంత్ కుమార్, డి.నెం.32-30-19/12, ఫ్ నెం.305, ఐశ్వర్య డీలక్స్ అపార్ట్‌మెంట్, టిపి రావు రోడ్డు, మారుతీ నగర్, విజయవాడ, మాచవరం, కృష్ణ-520004	22.90 గ్రా॥లు

తేది : 23.12.2024

స్థలము : విజయవాడ

సం/-
అసిస్టెంట్ జనరల్ మేనేజర్

విద్యాసంవత్సరం ముగుస్తున్నా...అందని దుస్తులు

విశాలాంధ్ర,-విస్సన్నపేట : ప్రతి ఏటా ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే పేద విద్యార్థులకు ప్రభుత్వం విద్యాసంవత్సరం ఆరంభంలో యూనిఫారం దుస్తులకు సంబంధించిన వస్త్రాన్ని అందిస్తోంది. దీన్ని అందంగా కుట్టించుకునేందుకు అవసరమైన కుట్టుకూలీ నగదును కూడా విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేస్తోంది. విస్సన్నపేటలోని పలువురు గిరిజన విద్యార్థులకు మాత్రం విద్యాసంవత్సరం మూడు నెలల్లో ముగుస్తున్నా ఇప్పటికీ ఈ దుస్తులు దరిచేరని దుస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళితే...స్థానిక గిరిజన సంక్షేమశాఖ బాలుర గురుకుల పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. వీరికి అవసరమైన యూనిఫారం వస్త్రాన్ని విద్యా సంవత్సరం ఆరంభంలోనే ప్రభుత్వం విద్యాలయ అధికారులకు పంపిణీ చేసి, విద్యార్థులకు అందించాలని సూచించింది. ఇందుకు అవసరమైన కుట్టుకూలీ నగదును తల్లిదండ్రుల ఖాతాలకు జమ చేసింది. ఈ వస్త్రాన్ని విద్యార్థులకు పంపిణీ చేయకుండా నేరుగా ఒక దర్జీకి పంపి, దుస్తులు కుట్టాలని సూచించినట్లు తెలిసింది. ఇందుకు ప్రభుత్వం తల్లిదండ్రుల ఖాతాలకు జమ చేసిన నగదు దర్జీలకు ఇచ్చేందుకు చాలదని, మరికొంత నగదును అదనంగా చేర్చి విద్యాలయంలో చెల్లించాలని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులు సూచించిన నగదును అందించారు. తీరా పలువురు విద్యార్థులకు నేటికీ కుట్టిన యూనిఫారం దుస్తులు అందకపోవటంతో విషయం వెలుగుచూసింది. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇవ్వాల్సిన దుస్తులు ఎందుకు ఇవ్వటంలేదనే విషయమై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ రత్నాకర్‌ను విచారించగా, విద్యార్థులందరికీ యూనిఫారం కుట్టించే పనిని తాము ఒక దర్జీకి అప్పగించిన మాట వాస్తవమేనన్నారు. సదరు దుస్తులు దర్జీ నుంచి విద్యాలయానికి వచ్చాయని, ఉపాధ్యాయుల సమ్మె వంటి కొన్ని తరగతుల విద్యార్థులకు అందించటంలో జాప్యం నెలకొందన్నారు. త్వరలోనే అందరికీ యూనిఫారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

29న రేషన్ షాప్ అభ్యర్థులకు పరీక్షలు

విశాలాంధ్ర-కూచిపూడి : ఉయ్యూరు రెవెన్యూ డివిజన్లోని మొవ్వ మండలంలో ఖాళీలుగా గల రేషన్ షాప్ డీలర్లకు దరఖాస్తులు చేసే అభ్యర్థులకు ఈనెల 29న ఉయ్యూరు జిల్లా పరిషత్ హై స్కూల్లో రాత పరీక్షలు జరుగుతాయని తాసిల్దార్ కే మస్తాన్ తెలిపారు. మొవ్వ మండలంలో ఖాళీలు గల దుకాణాలకు డీలర్ల కోసం పిలుపునిచ్చిన సమాచారంలో భాగంగా బార్లపూడి(7వనెంబరు), కోసూరు (25వనెంబరు), కాజ(35వనెంబర్) ప్రభుత్వ చౌకదుకాణాలను మెరిటోరియస్ స్పోర్ట్స్ పర్సన్ (ఓపెన్), కోసూరు (27వ నెంబరు) దుకాణం అంధత్వం/తక్కువ దృష్టి గల మహిళకు, కొండవరం (30వనెంబరు) బిసి-సి మహిళకు, కాజ(33వ నెంబరు) వినికిడి లోపం (ఓపెన్) గల అభ్యర్థులకు రిజర్వేషన్ ద్వారా కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఈనెల 24వ తారీఖు వరకు అప్లికేషన్లు దాఖలు చేసుకోవచ్చునని పేర్కొంటూ శనివారం (21వ తారీకు)సాయంత్రానికి ఆఫ్లైన్ ద్వారా 12 మంది దరఖాస్తులు దాఖలు చేసుకున్నారని వెల్లడించారు. ఈయనతో పాటు డిప్యూటీ తాసిల్దార్ (రెగ్యులర్) సిహెచ్ రఘురాం పాల్గొన్నారు.

కూచిపూడి నాట్య పతాక స్వర్ణోత్సవాలకు ఏర్పాట్లు

విశాలాంధ్ర-కూచిపూడి : ఈనెల 27, 28, 29 తేదీల్లో నాట్య క్షేత్రంలో కూచిపూడి హెరిటేజ్ ఆర్ట్స్ సొసైటీ నిర్వహించే కూచిపూడి పతాకస్వర్ణోత్సవాలకు శాస్త్రీయ నాట్య పుట్టినిల్లు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. కూచిపూడిలో గజ్జగట్టి నాట్య ప్రదర్శనలు ఇవ్వాలనే లక్ష్యంతో దేశ విదేశాల నుంచి కళాకారులు అత్యధిక సంఖ్యలో తరలిరానున్నారు.తొలి రెండు (శుక్ర, శని) రోజులలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్యకళాపీఠ ప్రాంగణంలో, ఆదివారం ముగింపు వేడుకలకు పెదసన గల్లు రోడ్‌లని పెదపూడిజిమ్ ప్రాంగణాన్ని నిర్వాహకులు తీర్చిదిద్దుతున్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్న 50 అడుగుల స్థూపం

29న సర్దార్ లచ్చన్న విగ్రహాలకు పాలాభిషేకం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఆధిపత్య కుల శక్తులు బి.సి. సామాజిక వర్గాల ఆత్మగౌరవం నీ దెబ్బతీసేందుకు కుట్రలు చేస్తున్నారని వారి మాయలో పడి నష్టపోవద్దు అని బీసీ నాయకులు,సీనియర్ న్యాయవాది వై.కోటేశ్వరరావు(వైకే) తెలిపారు. ఆదివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 15న నూజివీడులో స్వాతంత్ర్య సమరయోధులు, బడుగు, బలహీన వర్గాల జాతీయనేత సరార్ గౌస్ లచ్చన్న విగ్రము ఆవిష్కరణ కార్యక్రమాన్ని వివాదం చేస్తూ కించపరిచిన చర్యల ప్రక్షాళనగా ఈనెల 29న (ఆదివారం) రాష్ట్రంలోని సర్దార్ లచ్చన్న విగ్రహాలకు పాలాభిషేకం చెయ్యాలని తీర్మానం చేశారు.విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న బి.సి.నాయకులు పాల్గొనటం ద్వారా తప్పు చేసామని బహిరంగ ప్రకటనలు ఇప్పించిన దళ్ళర్యని అన్నారు. ఈ సమావేశంలో బి.సి సంఘాలు, కుల సంఘాల ప్రతినిదులు చంద్రరావు, బి.సి. రమణ. వీరవల్లి శ్రీనివాస్, పైకం రాజశేఖర్, నమ్మి అప్పారావు,ఎన్.వి. రావు, పి. రమేష్, మరిదు శివరామకృష్ణ, చంద్ర మౌళి, యానూ మురళి, పామర్తి జయప్రకాస్ అక్కా శ్రీనివాస్, వెల్లి ఏడుకొండలు గేడ్, మొగ్గి కృష్ణ,పాల్గొన్నారు.

విద్య ఉంటే ప్రపంచాన్ని శాసించవచ్చు

విశాలాంధ్ర-చల్లపల్లి : విద్యతోనే ప్రపంచాన్ని శాసించగలమనీ, క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు ఎదగాలని విజయవాడ ఆంధ్ర లయోలా కళాశాల ఫిజిక్స్ అధ్యాపకులు, కెరీర్ గైడెన్స్, మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ తుమ్మల శ్రీకుమార్ అన్నారు. చల్లపల్లి విజయ అకాడమీలో విద్యార్థినీ, విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో ఆదివారం ఆయన ఉపన్యసించారు. సృజనాత్మకత ఉన్న వ్యక్తులే ప్రపంచాన్ని శాసించగలరని తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులు భావవ్యక్తీకరణ నైపుణ్యాలు పెంచుకోవటం వల్ల ప్రస్తుత సమాజంలో ఉద్యోగ అవకాశాలు సాధించగల్గుతారని చెప్పారు. పాజిటివ్ థింకింగ్ అలవరుచుకోవాలనీ, సంపూర్ణ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పదవ తరగతి తర్వాత ఎలాంటి కోర్సులు చేయాలి అనే విషయాల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీకుమార్ను ఘనంగా సన్మానించారు. విజయా అకాడమీ ప్రిన్సిపల్ నాగళ్ల భీమారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్వచ్ఛ చల్లపల్లి రథసారధులు డాక్టర్ డిఆర్ కె.ప్రసాద్, డాక్టర్ పద్మావతి, విజయా అకాడమీతోపాటు పలు విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని పరిరక్షించుకోవాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : సామ్రాజ్యవాదుల కంబంధహస్తాల నుండి వ్యవసాయ రంగాన్ని పరిరక్షించుకోవటానికి అన్నివర్గాలు ఏకత్రాటిపైకి వచ్చి మోదీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని పలువురు నాయకులు పిలుపు నిచ్చారు. ఆదివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఉమ్మడి కృష్ణాజిల్లా కమిటీ ఆధ్వర్యంలో రైతుకూలీ సంఘం (ఆం. ప్ర.) రాష్ట్ర మహాసభల సావనీర్ ఆవిష్కరణ సభ నిర్వహించారు. జనసాహితీ రాష్ట్ర అధ్యక్షులు దివికుమార్ సావనీరును ఆవిష్కరించి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో భూమి,నీరు,పెట్టుబడులు, మార్కెట్లను విదేశీ బాడా కంపెనీలు, వీరితో కుమ్మక్కు అయిన స్వదేశీ కంపెనీలకు ధారాదత్తం చేసేందుకు మోదీ ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తోందన్నారు.అందుకే గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా, మధ్యదళారీల వద్ద రైతులు తెగనమ్ముకొనేలా చేసి రైతాంగాన్ని దివాలా తీయిస్తోంది. ఈ కార్యక్రమంలో ఓపీడీఆర్ రాష్ట్ర కార్యదర్శి వి.హనుమంతరావు, స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర అధ్యక్షులు డా.సి.విజయ, రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు జె.జగన్ తదితరులు పాల్గొన్నారు.

విస్సన్నపేట ప్రముఖునికి డాక్టరేట్

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటకు చెందిన ప్రముఖునికి ఢిల్లీకి చెందిన ఒక విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను బహుకరించింది. మండలంలోని తాతకుంట్ల గ్రామానికి చెందిన ఎన్.టి.వెంకటేశ్వరరావుకు ఢిల్లీకి చెందిన సోషల్ సోక్రటీస్ రీసెర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను బహుకరించింది. ఎన్.టి.వెంకటేశ్వరరావు తాతకుంట్ల గ్రామ సర్పంచిగా చేసిన కాలంలో తన సొంత నగదు, మరికొంత దాతల చేయూతతో గ్రామంలోని అన్ని రహదారులను సీసీ రహదారులుగా అభివృద్ధి చేశారు. గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు చేయటంతోపాటు లయన్స్‌క్లబ్ ప్రముఖునిగా మండలంలోని పలు గ్రామాల్లో సేవా కార్యక్రమాల్లో కీలకపాత్ర వహించారు. ప్రస్తుతం లయన్స్‌క్లబ్ ఆయనను జిల్లా అంబాసిడర్‌గా గుర్తించింది. డాక్టరేట్ అందుకున్న ఎన్.టి.వెంకటేశ్వరరావుకు అభినందనలు తెలిపారు.

కార్పొరేషన్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ప్రతివారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ఈ సోమవారం నిర్వహించటంలేదని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని అమ్మవారి గుడి వద్ద భవాని దీక్షల విరమణ జరుగున్నందున నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు నేపధ్యంలో నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చే మార్గంలో ట్రాఫిక్ ఆకాంక్షలు ఉన్నందున ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించటంలేదని ప్రజలు గమనించాలని తెలిపారు.

రైతులకు ప్రభుత్వం మేలు : ఎమ్మెల్యే మండలి

విశాలాంధ్ర-చల్లపల్లి : కూటమి ప్రభుత్వం రైతులకు సంపూర్ణమైన మేలు చేస్తోం దని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం చల్లపల్లి మండలం నడకుదురులో రైతుల వరి ధాన్యం పంటను ఎమ్మెల్యే పరిశీలించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరకు మాత్రమే ధాన్యం విక్రయించాలని, రైతు సేవా కేంద్రంలో తేమ శాతమే ఫైనల్ అని తెలిపారు. మిల్లర్లు అధిక తేమ శాతం చూపిస్తే అధికారుల దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు ధాన్యం విక్రయించిన రెండు రోజుల్లోనే సొమ్ము చెల్లిస్తోందని తెలిపారు. రైతులకు సంపూర్ణ న్యాయం చేయటమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

రైతుల అభివృద్ధికి కృషి చేయాలి

విశాలాంధ్ర-ఘంటసాల : ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రాన్ని వ్యవసాయ విస్తరణ సంచాలకులు డా.జి. శివనారాయణ శనివారం సందర్శించారు. కేవికే లో జరిగే అంశాలు, శాస్త్రవేత్తల పని తీరు, కార్యాచరణ ప్రణాళికను, ఇతర విస్తరణ కార్యక్రమములు, రైతులకు చేస్తున్న సేవలను, కేవికే అభివృద్ధిపై చర్చించారు. రైతాంగం అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేయాలని సమయానుకూలంగా ఏ విధంగా రైతులకు అవగాహన కల్పించొచ్చు అనే అంశాల గురించి సూచించారు. సూచనలను పాటించి కేవికే ను ప్రగతి పథం లో నడిపిస్తామని కేవికే సమన్వయ కర్త డా. డి. సుధా రాణి అన్నారు. ఈ కార్యక్రమం లో కేవికే శాస్త్రవేత్తలు, బోధనేతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బైపాస్ పై చీకట్లు... రాత్రి వేళల్లో ప్రమాదాలు

విశాలాంధ్ర-పమిడి ముక్కల: విజయవాడ -మచిలీపట్నం జాతీయ రహదారి లో ఆకునూరు నుంచి పామర్రు వరకు బైపాస్ ప్రయాణమంటే వాహన చోదకులు భయపడి పోతున్నారు.సర్వీసు రోడ్లు, వంతెనలపై లైట్లు లేక చిమ్మ చీకట్లో ప్రయాణించవల్సి వస్తోందని ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు.ఇటీవల ఆకునూరు ఫ్లైఓవర్ పై కానిస్టేబుల్ ప్రమాదానికి గురై మృతి చెందారు.గురజాడ మంటాడ తాడంకి గోపువానిపాలెం వద్ద ప్రయాణికులు రోడ్డు దాటుతున్న సమయంలో లైట్లు లేక గుర్తు తెలియని వాహనాలు ఢీ కొట్టి మృత్యువాత పడుతున్నారు. సంస్థ వారికి గుత్తేదారుల మధ్య వివాదాలు,సమన్వయ లోపంతో ఈ సమస్య ఉత్పన్నమవుతోందని సమాచారం. ఇక అండర్ పాస్ ల వద్ద ఎవరు ఎటువైపు వస్తున్నారో వెళుతున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, రహదారి అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

కృష్ణా నదిలో ఈతల పోటీలు



విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రిపబ్లిక్ డే వేడుకలు సందర్భంగా ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రివర్ క్రాస్ స్విమ్మింగ్ కాంపిటీషన్ జనవరి 12వ తేదీ ఆదివారం ఉదయం 6 గంటలకు నిర్వహిస్తున్నట్లు (ఏ.డి.డబ్ల్యు.ఏ)కార్యదర్శి మండపాటి లక్ష్మీనరసరాజు తెలిపారు. ఆదివారం పోటీల పోస్టర్‌ను అసోసియేషన్ నాయకులు విడుదల చేశారు. మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. దుర్గాఘాట్ నుండి ప్రకాశం బ్యారేజ్ వద్ద ఉన్న లోటస్ ఫుడ్ సిటీ వరకు ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. జనవరి 10 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని అన్నారు. అన్ని రకాల జాగ్రత్తలు తీసుకొని ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వెలగపూడి వెంకటేశ్వరరావు అధ్యక్షులు, దాసరి యుగేందర్ కన్వీనర్, కమిటీ మెంబర్స్ కర్రీ సాంబయ్య, ఎర్రంశెట్టి శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ గ్యారేజ్‌లో సెమీ క్రిస్మస్

విశాలాంధ్ర-తెనాలి : ఆర్టీసీలో గ్యారేజ్‌లో ఉద్యోగులందరూ ఐక్యంగా సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ పాల్గొన్నారు. దైవ సందేశకులు వి.సురేష్ మాట్లాడుతూ ఉద్యోగులందరూ తమ జీవితాలలో ఉద్యోగ నిర్వహణలో క్రీస్తును అనుసరించి జీవన విధానాన్ని ప్రేమ, కరుణ, దయ, త్యాగం అందరికి పంచాలని క్రిస్మస్ విశిష్టతను గురించి వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఐ.జె. ప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్ ఎన్.అభి రామ్ నాయక్, ఐ.రాజేష్ ఖన్నా, ప్రసాద్, బాబు, డి.సుధాకర్, కె.పాపయ్య, ఎన్.సుధాకర్, కె.సారమ్మ, జె.పద్మావతి, వి.ప్రసన్న జ్యోతి, ఎం.స్మిత వేణి, సుమతి, వెంకట మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గుంటూరు ఘాట్ టాలెంట్ షో కాంపిటీషన్స్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : సలాం నమస్తే గుంటూరు సొసైటీ ఫౌండర్ డాక్టర్ షేక్.షమా సుల్తానా ఆధ్వర్యంలో గుంటూరు పొన్నూరు రోడ్డులో ఉన్న ఎం.కన్వెన్షన్ హాలులో గుంటూరు ఘాట్ టాలెంట్ షో కాంపిటీషన్స్, సింగింగ్, డాన్స్, స్టాండ్ అప్ కామెడీ, మ్యాజిక్ షో, మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఫ్యాషన్ షో, మెహేంది, పోయెట్రీ, ఫన్నీ ఆర్ మెసేజ్ ఓరియెంటెడ్ స్కిట్ లాంటి పోటీలను ఆదివారం ఘనంగా ముగించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ సలాం, నమస్తే గుంటూరు సొసైటీ ఫౌండర్ డాక్టర్ షమా సుల్తానాలు మాట్లాడుతూ సలాం నమస్తే గుంటూరు సొసైటీ ఆధ్వర్యంలో గుంటూరు ఘాట్ టాలెంట్ షో గ్రాండ్ ఫినాలె పోటీలను ఘనంగా పూర్తి చేశామని, డిసెంబర్ 26వ తేదీన గురువారం సాయంత్రం 5 గంటల నుండి వెంకటేశ్వర విజ్ఞాన్ మందిరంలో సలాం నమస్తే గుంటూరు సొసైటీ ఇనాగరేషన్ జీజీటీ అవార్డ్స్ టీఫిఖ సెలబ్రిటీస్‌తో కల్చరల్ నైట్ గుంటూరు గాట్ టాలెంట్ షో లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ఇచ్చే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షేక్.కరీం, మేనేజర్ నాగేశ్వరావు, కోవిడ్ ఫైటర్స్ అల్లాబక్షు తదితరులు పాల్గొన్నారు.

మాల ఉద్యోగులకు ప్రాధాన్యత ఇవ్వాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : మాలల ఆర్గనైజేషన్‌కు గుర్తింపు ఇవ్వాలని మాల ఉద్యోగుల సంఘం నాయకులు మల్లెల వెంకట్రావు, నూతలపాటి జగదీష్ అన్నారు. ఆదివారం తాడేపల్లి బ్రహ్మానందపురంలో రాష్ట్ర మాల ఉద్యోగస్తుల ఐక్య వేదిక సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీలో మాల కులానికి సంబంధించి 15 మంది ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీలు ఉన్నారని వారివల్ల ఉపయోగం లేదని అన్నారు. మా ఎమ్మెల్యేలను ఆహ్వానించాము కుంటి సాకులు చెప్పి తప్పించుకున్నారని ఒక్కరు రాలేదని అన్నారు. మాల కులం ద్వారా సీట్లు నెగ్గి మా సమస్యలపై మాట్లాడకుండా వారి ప్రాధన్యత తగ్గించుకున్నారని అన్నారు. భవిష్యత్‌లో వారికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులను ప్రభుత్వాలు వేధిస్తున్నాయని, తమ గళం వినిపించేందుకు ఎస్సీ, ఎస్టీ ఆర్గనైజేషన్‌కు గుర్తింపు ఇవ్వకుండా చేస్తున్నాయని అన్నారు. ఉద్యోగుల ప్రమోషన్‌లో మా వాటాలు మాకు ఇవ్వకుండా వేరే వారికి ఇస్తున్నారని ప్రమోషన్ల గురించి ప్రస్తావనే లేదని అన్నారు.

మణిపురం ఫ్లైఓవర్ ఇరువైపుల ఆక్రమణలు తొలగించండి: కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : చిన్నెరుకుంట, మణిపురం ఫ్లై ఓవర్ ఇరువైపులా ఆక్రమణలను తొలగించాలని, అవసరమైతే పోలీస్ సహకారం తీసుకోవాలని, తొలగించిన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి సిద్ధంగా ఉండాలని పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. స్థానిక ఆర్టీసీ కాలనీ రోడ్‌లోని చిన్నెరుకుంట, మణిపురం ఫ్లై ఓవర్ ప్రాంతాల్లో కమిషనర్ ఆదివారం పర్యటించారు. తొలుత చిన్నెరుకుంటను పరిశీలించిన కమిషనర్ గతంలో చేపట్టిన పనులు, పెండింగ్ పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల వేగవంతంకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చిన్నెరుకుంట చుట్టు పక్కల ఆక్రమణల తొలగింపు చేపట్టడానికి సోమవారం నోటీసులు జారీ చేయాలని సిటి ప్లానర్‌ని ఆదేశించారు. కుంట చుట్టూ వాకింగ్ ట్రాక్ వంటి అభివృద్ధి పనులను చేపట్టడానికి ఇంజినీరింగ్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మణిపురం ఫ్లై ఓవర్‌కి ఇరువైపులా ఆక్రమణలను పరిశీలించి తక్షణం ఆక్రమణల తొలగింపునకు కార్యాచరణ ప్రారంభించాలని, అవసరమైతే పోలీస్ సహకారం తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. పర్యటనలో సిటి ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ మల్లికార్జున, టీపీఎస్ లక్ష్మణస్వామి, డీఈఈ నాగభూషణం, ఏఈ సాంబశివరావు పాల్గొన్నారు.

శ్రమయేవ జయతే పురస్కార ప్రధానోత్సవం

విశాలాంధ్ర-తెనాలి : విద్య లేకుండా తాము ఎంచుకున్న రంగంలో రాణించి ఉన్నత స్థాయికి ఎదగటమే కాకుండా ఎన్నో కుటుంబాలకు జీవనోపాధిని చూపుతున్న పలు రంగా కార్మికులను గుర్తించి శ్రమయేవ జయతే పురస్కారంతో సత్కరిస్తున్న పసులేటి కోటేశ్వరరావు తులశమ్మ స్మారక కమిటీ వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్ అభినందనీయులని చిన పరిమికి చెందిన సీనియర్ రైస్ మిల్లర్ మర్రెడ్డి బసివిరెడ్డి అన్నారు. పసులేటి కోటేశ్వరరావు తులశమ్మ స్మారక శ్రమయేవ జయతే పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం తెనాలి గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా జరిగింది. విశిష్ట అతిథిగా వీరబ్రహ్మేంద్ర చారిటబుల్ ట్రస్ట్ ఈఎల్‌వి అప్పారావు మాస్టారు పాల్గొని మాట్లాడుతూ కన్నబిడ్డలే తల్లిదండ్రులను మరచిపోతున్న ఈ రోజుల్లో అమ్మమ్మ తాతయ్యల పేరుతో పురస్కారాలను అందిస్తున్న తన్నీరు శివశంకర్ యువతకు ఆదర్శమన్నారు. గుంటూరుకు చెందిన ఫ్రెండ్స్ ఇంజనీరింగ్ వర్క్స్ అధినేత షేక్ మొహిద్దీన్, తెనాలి పట్టణానికి చెందిన సెంట్రింగ్ వర్క్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు మట్టుపల్లి సాంబయ్యలకు శ్రమయేవ జయతే పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. కమిటి వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా విద్య లేకపోయినా కేవలం శారీరక శ్రమకు బుద్ధిని జోడించి తమ రంగంలో ఉన్నత స్థాయికి ఎదిగిన వారిని గుర్తించి ఈ పురస్కారాలను ప్రదానం చేస్తున్నామన్నారు. పురస్కార గ్రహీతలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పసుపులేటి మల్లికార్జునరావు, తన్నీరు కళ్యాణ్‌కుమార్, వినోద్, హేమ్ కుమార్, రామమోహనరావు చౌదరి, షఫీ, రాంబాబు, మురళి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత నగరానికి ప్రజలు సహకరించాలి

విశాలాంధ్ర-మంగళగిరి : భారత ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఎమెండ్‌మెంట్-2021 నియమాలననుసరించి మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ సంచులు, ప్లాస్టిక్ పేపర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బాటిల్స్, విక్రయించుట, వినియోగించుట నిషేధం పక్కాగా అమలులో ఉంటుందని నగర కమిషనర్ అలీం బాషా ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారికి భారీ మొత్తంలో జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ మార్కెట్‌కు వచ్చేటప్పుడు ఇంటి నుంచి వస్త్రంతో, పేపర్‌తో లేదా జూట్‌తో చేసిన సంచులను మాత్రమే వెంట తెచ్చుకోవాలని సూచించారు. నిషేధిత ప్లాస్టిక్ సంచులు విక్రయించినా వినియోగించినా చర్యలు తప్పవని తెలియచేశారు. ఇప్పటికే నగరంలో ప్లాస్టిక్ నిషేధంపైన చర్యలు చేపట్టడం జరిగిందని, ఈ చర్యలలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలో 20కేజీల ప్లాస్టిక్ బ్యాగ్‌లను సీజ్ చేశామని అన్నారు. సచివాలయ సిబ్బందిని ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకుంటున్నామని స్పష్టంచేశారు. అదేవిధంగా షాపుల యజమానులు ప్లాస్టిక్ వ్యర్థాలను డ్రైనేజ్‌లలో వేయరాదని, తమ షాపులలో ఏర్పాటు చేసుకున్న బిన్‌లలో మాత్రమే ఉంచి ప్రతిరోజు పారిశుద్ధ్య సిబ్బంది వచ్చినప్పుడు ట్రాక్టర్‌లలో వేయాలని విజ్ఞప్తి చేశారు.

అఘోరి దాడి ఘటనపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

విశాలాంధ్ర-మంగళగిరి : గత నెల 18వ తేదీన మంగళగిరి ఆటోనగర్ ఆల్ఫా హోటల్ ఎదుట ఓ కార్ వాష్ సెంటర్ వద్ద అఘోరీ జరిపిన దాడిలో గాయపడిన ఆరేపల్లి రాజు అనే మీడియా ప్రతినిధి జాతీయ మానవ హక్కుల కమీషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సి)కి ఫిర్యాదు చేశారు. మంగళగిరికి చెందిన ఓ ప్రజాప్రతినిధి పదవీ ప్రమాణ స్వీకారం సందర్భంగా వార్త కవరేజికి విలేకరులు వెళ్ళగా అదే ప్రాంతంలో కార్ వాష్ సెంటర్ వద్ద మారణాయుధాలతో నగ్నంగా తిరుగుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్న సందర్భంలో విలేకరులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అదే సమయంలో అఘోరీ తన కారులో ఉన్న ఇనుప రాడ్డును తీసుకొని విలేకరితో పాటు కార్ వాష్ సెంటర్‌లో ఉన్న యువకులపై విచక్షణారహితంగా దాడికి పాల్పడింది. ఈ ఘటనలో విలేకరి కాలు విరిగి తీవ్ర గాయాలపాలవ్వగా స్థానికులు ఆస్పత్రిలో చేర్చారు. కాగా సదరు ఘటనలో పోలీసులు అఘోరిపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అఘోరీపై చట్టపరమైన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరుతూ జాతీయ మానవ హక్కుల కమీషన్‌కి బాధితుడు ఫిర్యాదు చేశారు.

ఏసు చూపిన బాటలో నడవాలి: దేగల

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : కుల మతాలకు అతీతంగా ఘనంగా చేసుకునే పండుగ క్రిస్మస్ అని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఐడీసీ)చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. దేగల యూత్ ఆధ్వర్యంలో శారద కాలనీలోని షెకీనా ప్రార్థన మందిరంలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు దేగల ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని చర్చి ఫాస్టర్ జి.విజయ్ కుమార్‌తో కలిసి కేక్ కట్ చేసి అందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పేద వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఏపీ ఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని చేసుకునే అతి పెద్ద పండుగన్నారు. క్రీస్తు ఆశీస్సులు మనందరికీ ఉండాలని కోరారు. ఏసు చూపిన బాటలో నడవాలని కోరారు.

66 మద్యం బాటిళ్ల పట్టివేత

విశాలాంధ్ర-తాడికొండ : మండల పరిధిలోని నిడుముక్కల గ్రామ ప్రధాన సెంటర్‌లో అక్రమంగా మద్యం అమ్ముతున్న తలతోటి శేషయ్య వద్ద నుంచి 66 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం.జోజి ఆదివారం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గ్రామంలో శేషయ్య వద్ద నుంచి 66 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు శేషయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై జోజి తెలిపారు.

రైతులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర-తాడికొండ : అమరావతి రాజధానిలో రైల్వే ట్రాక్ ఇన్నర్‌రింగ్ రోడ్డు కొండవీటి వాగు విస్తరణకు సంబంధించి భూ సేకరణ జరుగుతున్న నేపథ్యంలో నియోజకవర్గ కేంద్రమైన తాడికొండ షిరిడి సాయిబాబా కళ్యాణ మండప ఆవరణలో ఆదివారం బాధిత రైతులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులకు తమ భూములను భూ సమీకరణ ద్వారా తీసుకొని రాజధాని పరిహారం మాదిరిగా తమకు 1250 గజాలు స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతు ప్రయోజనాలను పట్టించుకోకుండా మొండిగా వ్యవహరిస్తే రైతుల నుంచి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. కొప్పరావూరు, కంతేరు, తాడికొండ, పెద్దపరిమి, మోతడక, అనంతవరం, వడ్డమాను, వైకుంఠపురం గ్రామాలకు చెందిన పలువురు రైతులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఆయా గ్రామాలలో కమిటీలను ఏర్పాటు చేసుకుంటామన్నారు. అవసరమైతే లీగల్‌గా ప్రభుత్వాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంటామని స్పష్టంచేశారు. మానవతా దృక్పథంతో రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వానికి తాము వ్యతిరేకం కాదని స్పష్టంచేశారు. అధిక సంఖ్యలో రైతులు హాజరయ్యారు.

క్రీస్తు పుట్టుక ప్రపంచ మానవాళి అభ్యుదయానికి దోహదం

విశాలాంధ్ర-దాచేపల్లి: క్రీస్తు పుట్టుక ప్రపంచ మానవాళి అభ్యుదయానికి దోహదపడినట్లు విద్యుత్ శాఖ ఏఈ పగడాల సందీప్ కుమార్ చెప్పారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నారాయణపురంలోని కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఏఈ సందీప్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జేఏఈ ఆశీర్వాదం, పట్టణ ఏఈ భగవాన్, గ్రామీణ ఏఈ దండా నాగేశ్వర రావు తదితరులు మాట్లాడారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు. వేడుకల్లో భాగంగా ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఆర్ఓ, ఓఎమ్మెన్ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

విశాలాంధ్ర-విజయపురిసౌత్ : మాచర్ల మండలం విజయపురిసౌత్‌లోని శివ గణేష్ హోటల్ వెనుక ప్రదేశంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ ఆదివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం విజయపురి సౌత్‌లోని సీ టైపుకు చెందిన బీర్నిడి రమేష్(సద్ది రమేష్)తో పాటు మరో ఇద్దరు పేకాట ఆడుతున్నట్లు ఎస్ఐకు సమాచారం అందింది. దీంతో పోలీస్ సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేశారు. రూ.3,580 నగదును స్వాధీన పరచుకొని నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులు బీర్నిడి రమేష్‌తో పాటు ఇద్దరిని కోర్టులో హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రధానం

విశాలాంధ్ర - వినుకొండ: గణిత శాస్త్రవేత్త రామానుజన్ జయంతి సందర్భంగా మ్యాట్రిక్స్ జూనియర్ కాలేజ్ ఆధ్వర్యంలో ఆదివారం ఐఐటి మ్యాచ్ ఒలంపియాడ్ పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో పట్టణంలోని పలు విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా మాట్రిక్స్ జూనియర్ కాలేజ్ అధినేత రామిరెడ్డి ప్రసంగిస్తూ విద్యార్థులు గణిత శాస్త్ర నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని అన్నారు. ఆధునిక ప్రపంచంలో గణితానికి ఎనలేని ప్రాధాన్యత ఉందని చెప్పారు. కార్యక్రమ నిర్వాహకులు సూర్యతేజ, హనుమంత రెడ్డి మాట్లాడుతూ. ఇటువంటి కార్యక్రమా న్ని విజయవంతం చేసిన విద్యార్థులకు, ఉపాధ్యాయు లకు, పాఠశాల, కళాశాలల యాజమాన్యానికి ధన్యవాదా లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు గీతాంజలి కిషోర్, గీతమ్స్ మాలపాటి కోటిరెడ్డి, వివేకానంద విద్యాసంస్థ రఫీ, గుడ్ షెఫర్డ్ స్కూల్ ఇన్నారెడ్డి, గీతమ్స్ గ్లోబల్ మైండ్ నారాయణ, పాంచ జన్య స్కూల్ శ్రీనివాసరావు, నిర్మల స్కూల్ యాజమాన్యం, శర్మ స్కూల్ యాజమాన్యం, విజేత విద్యాసంస్థ సాయి, సాధన ట్యూషన్స్ బాష తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఐ ఏరియా ముఖ్య కార్యకర్తల సమావేశం

విశాలాంధ్ర-అమరావతి : ఏరియా సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు అమరావతిలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ మండల కార్యదర్శి కారంపూడి చెన్నకేశవరావు అధ్యక్షతన జరుగుతుందని చెన్నకేశవ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు, నాయకులు శరణం విజయ్, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బైరపట్నం రామకృష్ణ హాజరై ప్రసంగిస్తారని చెప్పారు. సమావేశానికి సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

వైసీపీ నాయకులకు కూటమి నేతల స్ట్రాంగ్ వార్నింగ్

విశాలాంధ్ర - వినుకొండ : ఐదేళ్ల రౌడీయిజం, హత్యలు, సెటిల్‌మెంట్‌లతో వినుకొండలో భయోత్పాతం సృష్టించిన వైకాపా నేతలు కూటమిప్రభుత్వంపై బురదజల్లుతున్నారని తెలుగుదేశం, భాజపా, జనసేన నాయకులు మండిపడ్డారు. ఒళ్లు దగ్గరపెట్టుకోవడంతో పాటు వాళ్లు చేసిన అరాచకాలపై త్వరలోనే సమాధానాలు చెప్పడానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. వినుకొండలో వైసీపీ పార్టీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకల సందర్భంగా ఆ పార్టీ నాయకులు చేసిన ఆరోపణలను కూటమి నాయకులు తీవ్రంగా ఖండించారు. ఆదివారం వినుకొండలో జరిగిన మీడియా సమావేశంలో నియోజకవర్గ బీజేపీ ఇన్‌ఛార్జి యార్లగడ్డ లెనిన్, జనసేన సమన్వయకర్త నాగశ్రీను రాయల్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ అయూబ్‌ఖాన్ వైసీపీ విమర్శలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. యార్లగడ్డ లెనిన్ మాట్లాడుతూ. వైసీపీ నాయకులు ముందుగా వాళ్ల సంగతేంటో వాళ్లు చూసుకోవాలి. వాళ్లు చేసిన దందాలు ఎన్నో.. పోలీస్ స్టేషన్లను సెటిల్‌మెంట్ కేంద్రాలుగా మార్చుకున్నారు. వాళ్లొచ్చి కూటమి నేతల్ని బెదిరించడమా? ఎవరి సంగతి ఎవరు తేల్చుతారు? మార్కాపురం రోడ్డులో లారీ పేరిట దందా చేసి దోచుకున్నది నిజం కాదా? వైసీపీ పాలనలో పల్నాడులో లెక్కలేనన్ని హత్యలు చేశారు. వినుకొండ నియోజకవర్గం రావులాపురంలో బీసీ వ్యక్తి జల్లయ్యను దారుణంగా హత్య చేశారు. మాచర్ల నియోజకవర్గంలో చంద్రయ్యను చంపేశారు. భాజపా నాయకుడు మేడం రమేష్‌పై దాడి చేసి చంపాలని చూశారు. ఆ కేసులో వైకాపా ప్రజాప్రతినిధులు, అధికారులకు కూడా సంబంధం ఉంది. అవన్నీ త్వరలోనే బయటకు వస్తాయి. సీఐడీ దర్యాప్తు కూడా జరగబోతోంది. ఒక మాజీ ఎమ్మెల్యే

పోలీస్‌స్టేషన్ నుంచి వీడియో కాల్ చేసి స్థలం విషయంలో బెదిరించడం కంటే దారుణం ఉంటుందా? లెక్కలేనన్ని భూకబ్జాలు చేశారు. సర్వే నంబర్లు టాంపర్ చేశారు. మార్కాపురం రోడ్డులో కోట్ల విలువైన భూమి విషయంలో బెదిరించి కమీషన్లు తీసుకున్నారు. వాళ్లందరికీ కూడా టైమ్ దగ్గర పడుతోంది. అయిదేళ్ల వైకాపా పాలనలో జర్నలిస్టులను కూడా బెదిరించారు. నోరునొక్కారు. 2029 వరకు జమిలీ ఎన్నికలు వచ్చే ప్రసక్తి లేదు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నాగశ్రీను రాయల్ మాట్లాడుతూ జగన్ పుట్టిన రోజు వేడుకలు కూడా జరుపుకోలేని స్థితిలో వైసీపీ నేతలు అవాకులు చెవాకులు పేలుతున్నారు. కూటమి నాయకులు పోలీస్‌స్టేషన్లలో దందాలు చేస్తున్నారన్న మాటను దమ్ము ఉంటే నిరూపించాలి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీస్‌స్టేషన్లలో 6 నెలల ఫుటేజీ తీసుకోస్తామని, ఆ పార్టీ నాయకులు కూడా 5 ఏళ్ల ఫుటేజీ తీసుకురావాలి. వైసీపీ వాళ్లలా అక్రమ కేసులు పెట్టడానికి వీల్లేదని, అందరినీ సమానంగా చూద్దామనే ఎమ్మెల్యే జీవీ ఎప్పుడూ చెబుతుంటారు. 2020 మున్సిపల్ ఎన్నికల్లో జనసేన తరఫున 5 వార్డులకు పోటీపడితే నాటి ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి ఫోన్ చేసి ప్రాణాలు తీస్తామని బెదిరించి నామినేషన్లు ఉపసంహరణ చేసుకునేలా చేశారు. అది వైకాపా సంస్కృతి. వైసీపీ పాలనలో వినుకొండలో ఎక్కడ చూసినా గంజాయి, గుట్కా దొరికింది. ఎన్డీఏ ప్రభుత్వంలో ఆ పేరు వినిపించకుండా చేశారు. ఏనుగుపాలెంలో పంచాయతీ ఎన్నికల సమయంలో అప్పటి ఎస్సై వెంకట్రావు ఎలా ప్రవర్తించారో మరిచిపోతే ఎలా? భయపెట్టి ఎన్నికలు చేశారు. నామినేషన్లు వేయకుండా బెదిరించి ఎన్నికలు చేసుకున్నారు. వైసీపీని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా విశ్వసించడం లేదని, కేవలం ఆ పార్టీ శ్రేణులను కాపాడుకోవడం కోసమే కూటమి ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని మండిపడ్డారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ మాట్లాడుతూ జగన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకల్లో వైసీపీకి చెందిన కొంతమంది న్యాయవాదులు అనుచితమైన వ్యాఖ్యలు చేశారని, వాటిని కూటమి ప్రభుత్వం తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. మాపై విమర్శలు చేసేముందు వైసీపీ 151 సీట్ల నుంచి 11 స్థానాలకు దిగజారిందో కారణాలు తెలుసుకోవాలని, ప్రజల్లో నమ్మకాన్ని ఎందుకు కోల్పోయారో ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. అది తెలుసుకోకుండా కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యేగా బొల్లా బ్రహ్మనాయుడు ఉన్నప్పుడు విచ్చలవిడిగా గంజాయి రవాణా జరిగిందన్నారు. చదువుకునే పిల్లలు ఎంతోమంది గంజాయికి బానిసలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడెక్కడ భూఆక్రమణలు చేశారో వినుకొండ ప్రజలందరికీ తెలుసన్నారు. వినుకొండలో ఎలాంటి అన్యాయాలు, అక్రమాలు, భూదందాలు జరగడానికి వీల్లేదని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారని పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర - వినుకొండ : కూటమి పాలనలో అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. సంక్షేమంతో పాటు ఆపద సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సకాలంలో నిస్సహాయులకు అండగా నిలవడం ఎంతో సంతోషం, సంతృప్తిని ఇస్తోందన్నారు. ఆదివారం స్థానిక వినుకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నలుగురికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.6 లక్షల విలువైన ఆర్థిక సాయం చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో చివరి లబ్దిదారులకు వరకు కూడా అభివృద్ధి, సంక్షేమఫలాలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించినట్లు తెలిపారు.

పులుకూరి కాంతారావుకు అభినందనలు

విశాలాంధ్ర-దాచేపల్లి : నాగార్జున సాగర్ కుడి కాల్వ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా పులుకూరి కాంతారావు ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం విదితమే. దాంతో ఆయన శనివారం ప్రమాణస్వీకారం కూడా చేశారు. దాచేపల్లి మండలం రామాపురం మేజరు కాల్వ డీసీ చైర్మన్ నుంచి సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవి పొందిన కాంతారావుకు రామాపురం మేజరు కాల్వ డీసీ వైస్ చైర్మన్ ఆకూరి వెంకటరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. అదేవిధంగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, పిడుగురాళ్ల వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ మాజీ అధ్యక్షుడు వేముల వినోద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పరుగుల వీరుడు అబ్దుల్లాకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

విశాలాంధ్ర - వినుకొండ : దాతృత్వానికి, దాన గుణానికి హద్దులు ఎల్లలు లేవని చాటిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్. నసీర్ అహ్మద్ తన నియోజకవర్గం, తన జిల్లా, కానీ ఒక పేద మైనారిటీ గ్రామీణ క్రీడాకారుడు, పరుగుల వీరుడు, పల్నాడు జిల్లా, వినుకొండ పట్టణవాసి అయిన షేక్ అబ్దుల్లాకు 2025 ఫిబ్రవరి 25న లద్దాక్ (లే) లో జరగబోయే 42 కిలోమీటర్ల మారథాన్ గిన్నిస్ బుక్ పోటీలలో పాల్గొనేందుకు అవసరమైన ఆర్థిక సహాయం తో పాటు గెలుపు కొరకు మనోధైర్యం ఇచ్చిన గుంటూరు తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు. ఇచ్చిన మనోధైర్యానికి, చేసిన సహాయానికి సంతోషిస్తూ సదరు అబ్దుల్లా కృతజ్ఞతలు తెలుపుకున్నారు. మరియు ఎమ్మెల్యే దాతృత్వం చూసి స్పందించిన వ్యక్తిగత పనుల కోసం వచ్చిన ప్రముఖులు ఇద్దరు స్పందించి, స్వచ్ఛందంగా వారు కూడా ఆర్థిక సహాయానికి ముందుకు రావడం ఎంతో సంతోషదాయకం. ఈ కార్యక్రమానికి సహకరించిన వినుకొండ డిగ్రీ కాలేజీ విశ్రాంత ఉద్యోగి ఎండి కరీముల్లా, గుంటూరు వాసి, సంఘ సేవకులు ,మైనార్టీ నాయకులు షేక అప్సర్ , గుంటూరు తూర్పు నియోజకవర్గం యువ మైనార్టీ నాయకులు షేక్ జుబేర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

పవర్ ఫౌండేషన్ దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-మాచర్ల : పేదలను గుర్తించి వారికి చేయూతనివ్వ డమే పవర్ ఫౌండేషన్ లక్ష్యమని సంస్థ నిర్వా హకులు, న్యాయవాది జీజే రావు అన్నారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఆదివారం ఆయన పలువురు వికలాంగులు, నిరాశ్రయులకు దుప్పట్లను పంపిణీ చేశారు. న్యాయవాది జీజే రావు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి పది మందికి సాయం చేయాలనే నినాదంతో ముందుకు నడవాలన్నారు. నిరాశ్రయులకు సహాయ సహకారాలు అందించేందుకు తమ సంస్థ ముందుంటుందని, తమ సంస్థ ద్వారా వారిని ఆదుకునేందుకు దాతలు ముందు కురావాలని ఆయన కోరారు. ఫౌండేషన్‌ను నెలకొల్పిన కొద్ది రోజులకే ఎంతోమంది వికలాంగులు, పేదలకు తన వంతు సహాయం చేశామన్నారు. ఈ సందర్భంగా రూ.20 వేల వ్యయంతో 100 మంది అనాధలకు దుప్పట్లను అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ డైరెక్టర్లు గురజాల అప్పారావు, పెరుమాళ్ళ మునెయ్య, భీమవరపు శ్రీనివాసరావు, వై.సాంబశివరావు, రత్నారావు, రాజు పాల్గొన్నారు.

ప్రేమ క్షమా గుణమే క్రీస్తు మార్గం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-ఫిరంగిపురం: ఎదుటి వారి పట్ల ప్రేమ చూపి క్షమా గుణం కలిగిన యేసుక్రీస్తు మార్గం అందరికి ఆచరణీయమని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ కుమార్ అన్నారు. మండల కేంద్రమైన ఫిరంగిపురం టిడిపి కార్యాలయ ఆవరణలో ఆదివారం ఘనంగా ఏర్పాటు చేసిన సెమీక్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరైన ఆయన క్రీస్తు పుట్టుక గురించి సమాజ మార్పు కోసం బావం తెలియ జేస్తూ ప్రదర్శించిన వివిధ డాన్స్‌లు తననెంతో సంతోషపరిచాయని విద్యార్థులను అభినందించారు. యేసు క్రీస్తు సాధారణ మనుషులను ప్రపంచ నాయకులుగా ప్రజలకు గుర్తింపు తీసుకొచ్చిన యేసు మార్గం ఎంతో ఆదర్శనీయమన్నారు. కుల మతాలకు అతీతంగా ఫిరంగిపురంలో నేడు నిర్వహించిన ఈ సెమీ క్రిస్మస్‌లో పాల్గొనడం మరువలేనిదన్నారు. క్రిస్మస్ సందడి చూడాలంటే ఫిరంగిపురానికే ఓ ప్రత్యేకత ఉందని క్రిస్మస్ ప్రాధాన్యతను గురించి వివరించారు. మండల టిడిపి నాయకులు మండవ నర్సింహారావు, కొత్తపల్లి కోటేశ్వరావు, మరియ జ్యోతి, బాల జోజి, గుండిగ జోసెఫ్ మాష్టార్, కోటా శేషు, పెరికల హృదయరాజు, పెరికల వెలాంగిణిరాజు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర-రొంపిచర్ల : స్థానిక కేరళ మోడల్ స్కూల్‌లో ఆదివారం నరసరావుపేట శ్రీ దత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆర్ఎంపీ, గ్రామీణ వైద్యులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న శ్రీ దత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఆర్ఎంపీ వైద్యులు సీజనల్ వ్యాధులు, సాధారణ వ్యాధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. గుండె సంబంధిత వ్యాధులు తమ దృష్టికి ప్రాథమికంగా వైద్య పరీక్షలు జరిపి అనంతరం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ సిఫార్సు చేయాలని అన్నారు. ఈ సందర్భంగా పలు వ్యాధులపై వారికి అవగాహన కలిగించారు. అనంతరం గ్రామీణ వైద్యులకు మెడికల్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్స్ పీఆర్వో భాషా, గ్రామీణ వైద్యులు సిరిపురపు అంజిబాబు, నుసుం భాస్కర్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలేరమ్మ ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం

విశాలాంధ్ర-రొంపిచర్ల : మండలంలోని బుచ్చిపాపన్న పాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ పోలేరమ్మ తల్లి నూతన ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారి ఆలయ ప్రతిష్ఠతో పాటు ఆలయంలో అమ్మవారి శిలా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం కూడా వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ అష్టలక్ష్మీ కుంకుమార్చన పూజలతో అమ్మవారి ఆలయం, శిలా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా జరిగింది. నరసరావుపేట మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, టీడీపీ రాష్ట్ర యువజన నాయకులు వడ్లమూడి వెంకట కిషోర్, పలువురు టీడీపీ, వైసీపీ నాయకులు, కార్య కర్తలు ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంతో పాటు పరిసర గ్రామస్థులు, భక్తులు, మహిళలు అధికసంఖ్యలో ఆల యాన్ని సందర్శించి అమ్మవారికి పూజలు నిర్వహిం చారు. గ్రామంలో తమ పుట్టిళ్ళకు వచ్చిన ఆడపడు చులకు వస్త్రములను బహుకరించారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్ని ఇళ్ళకు బంధువులు, మిత్రులు, ఆడపడుచుల రాకతో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది.

కృష్ణానదిలో ఈతల పోటీలు

విశాలాంధ్ర-తాడేపల్లి : రిపబ్లిక్ డే వేడుకలు సందర్భం గా ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రివర్ క్రాస్ స్విమ్మింగ్ కాంపిటీషన్ జనవరి 12వ తేదీ ఆదివారం సాయంత్రం నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి మండపాటి లక్ష్మీనరసరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ దుర్గ ఘాట్ నుంచి ప్రకాశం బ్యారేజ్ వద్ద ఉన్న లోటస్ ఫుడ్ సిటీ వరకు ఈ పోటీలు జరుగుతాయని తెలియచేశారు. 11నుంచి 18 సంవత్సరాల వరకు కేటగిరి-1, 19 నుంచి 30 సంవత్సరాల వరకు కేటగిరి-2, 31 నుంచి 40 సంవత్సరాల వరకు కేటగిరి-3, 41 నుంచి 50 సంవత్సరాల వరకు కేటగిరి-4, 51 నుంచి 60 సంవత్సరాల పైబడిన విభాగాలలో ఈ పోటీలు ఉంటాయని అన్నారు. ప్రతి క్యాటగిరిలో మొదటి, రెండవ, మూడవ బహుమతులతో పాటు, విజేతలకు సర్టిఫికెట్స్ అందచేయబడతాయని తెలిపారు. జనవరి 10వ తేదీన లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని అన్నారు. అన్ని రకాల జాగ్రత్తలు తీసుకొని ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వెలగపూడి వెంకటేశ్వరరావు, కన్వీనర్ దాసరి యుగేందర్, కమిటీ సభ్యులు కర్రి సాంబయ్య, ఎర్రంశెట్టి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చెవి, ముక్కు, గొంతు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రముఖ ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ బయ్యా సుధీర్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : నేడు పెరుగుతున్న ఆధునీకరణ వల్ల శబ్ద వాయు కాలుష్యాల వల్ల ఇతర వ్యాధు లు పెరుగుతున్నట్లే చెవి, ముక్కు, గొంతులకు సంబంధించిన సమస్యలు కూడా ఎక్కువవుతున్నాయని, దీంతో వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ బయ్యా సుధీర్ హెచ్చరించారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'చెవి, ముక్కు, గొంతు సమస్యలు'పై ఆరోగ్య సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ బయ్యా సుధీర్ మాట్లాడుతూ తరచుగా వచ్చే తల నొప్పి, చెవిపోటు, జలుబు, తుమ్ములు, గొంతు నొప్పులు లోపల నిఘాడంగా ఉన్న తీవ్ర వ్యాధులకు లక్షణాలు కావచ్చని, ఇవి తరచుగా వస్తుంటే అశ్రద్ధతో తాత్కాలిక ఉపశమనాల కోసం ప్రయత్నించక రోగ నిర్ధారణకై చెవి, ముక్కు, గొంతు వ్యాధుల నిపుణులను సంప్రదించాలని కోరారు. వినికిడి లోపాలు చెవిలో హోరు, తల తిరగటం, ముక్కు వెంట రక్తం కార టం, గొంతులో మార్పు లాంటివి ఈఎన్‌టీ సమస్యలుగా భావించాల న్నారు. చెవిలో గుబిలి కట్టడం, వినికిడికి సంబంధించిన చెవి నరాలు దెబ్బతినటం తదితర కొన్ని గొంతు వ్యాధులు వినికిడి లోపానికి కారణమవుతాయని పేర్కొన్నారు. వినికిడి లోపం ఉన్నపుడు ఈఎన్‌టీ వైద్యులను సంప్రదించాలని, అవసరాన్ని బట్టి తగు సర్జరీలను గురించి..వినికిడి యంత్రాల వాడకం గురించి తెలియ జేస్తారన్నారు. వినికిడి యంత్రాలను సిగ్గుపడకుండా ఉపయోగించాల్సిం దేనని, ముక్కుకి తెలియకుండా దెబ్బ తగలటం, ముక్కును గట్టిగా చీదటం, ముక్కులోకి వేలుపోనిచ్చి తిప్పటం లాంటి వల్ల..కొన్ని ఇన్ఫెక్షన్ల వల్ల ముక్కు వెంట రక్తం కారుతుం దన్నారు. సైనసైటిస్ ఉన్న వాళ్ళు తమ ముక్కులో క్యాన్సర్ గడ్డలు వచ్చినా రక్తం కారుతున్నా డాక్టర్‌ను సంప్రదిం చాలని సూచించారు. చెవిలో పుల్లలు, పిన్నీసులు పెట్టి తిప్పటం చేయరాదని, నేడు ఈఎన్‌టీలో అనే అధునాతన సర్జరీలు అందుబాటులోకి వచ్చినట్లు డాక్టర్ సుధీర్ వెల్లడించారు. డాక్టర్ సుధీర్‌ను అవగాహన సంస్థ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. సభలో కొండా శివరామిరెడ్డి, డాక్టర్ ఆర్.రామచంద్రరావు, అంజిరెడ్డి, సత్యన్నారాయణలు పాల్గొన్నారు.

దుప్పట్లు, పులిహోర ప్యాకెట్ల పంపిణీ

విశాలాంధ్ర - వినుకొండ : పట్టణంలో శనివారం రాత్రి బిక్షాటన చేయుచున్న యాచకులకు, నిరాశ్రయులకు యంగ్ స్టార్స్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు , పులిహోర ప్యాకెట్లు పంపిణి కార్యక్రమం చేపట్టారు.. ఫౌండేషన్ అధ్యక్షులు పమిడిపల్లి అనిల్ మాట్లాడుతూ. గత కొన్ని రోజులుగా వినుకొండ లో విపరీతమైన చలి తీవ్రత పెరుగుతున్న కారణంగా మా ఫౌండేషన్ తరుపున ఈ సేవ కార్యక్రమం చేపట్టమని అన్నారు. రాబోయే కాలంలో మరెన్నో కార్యక్రమాలు చేపట్టబోతున్నామని అయన తెలిపారు. పులిహోర ప్యాకెట్ల కు సహకారం అందించిన పెనుమల బాలరాజు కు ధన్యవాదములు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గుమ్మడి మనోహర్ బాబు, పెనుమల వెంకట్రావు, అంబటి అంకారావు, సునీల్ కుమార్, పెనుమల బాలరాజు, అంబటి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో ఎన్నికల కోలాహలం

అధ్యక్ష అభ్యర్థి యేల్చూరి ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర-రెంటచింతల : సుదీర్ఘ చరిత్ర ఉన్న ఇండియా ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసిసి)కు ఎన్నికలు ఈనెల 28న నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్న క్రమంలో బరిలో ఉన్న అభ్యర్థులు గెలుపు కోసం ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రచారపర్వం చేపట్టారు. అధ్యక్ష స్థానం కోసం యేల్చూరి వెంకటేశ్వర్లు, రంగా బాలకృష్ణ పోటీ పడుతు న్నారు. ఎన్నికల్లో తలపడుతున్న వారిరువురూ ఉమ్మడి గుంటూరు జిల్లా ఓటర్లతో ఫోన్ ద్వారా సంప్రదింపులు జరుపుతూ మరోపక్క జిల్లాలో దగ్గరగా ఉన్న వారి వద్దకు నేరుగా వెళ్లి తమ అభ్యర్థిత్వానికి మద్దతుగా ఓటేయాలని విజ్ఞప్తులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అధ్యక్ష పదవికి బరిలో ఉన్న యేల్చూరి వెంకటేశ్వర్లు ఆదివారం రెంటచింత లకు వచ్చి వ్యాపారవేత్త, మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు ఏచూరి వెంకట సైదయ్యను సంప్రదించి తన అభ్యర్థిత్వానికి మద్దతుగా ఓటేయాలని కోరారు. అభ్యర్థి రాకను స్వాగతిస్తూ స్థానిక వ్యాపారులు ఏచూరి వెంకయ్య, ఆకుల నరసింహారావు శాలువాతో సత్కరించారు. వ్యాపారులకు మేలు చేయాలనే సంకల్పంతో ఇండియా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యాలయం 1941లో గుంటూరు జిన్నా టవర్ సెంటర్లో ఏర్పాటయింది. తొలినాళ్ళలో 900 మంది వ్యాపారులకు సభ్యత్వం ఉండగా కాలక్రమేణా ఆ సంఖ్య సుమారు 3,200కు చేరింది. గతంలో 12 ఏళ్లకు పైగా మద్ది సుదర్శన్ అధ్యక్షునిగా పనిచేయగా, ఆ తర్వాత 34 ఏళ్ల పాటు సుదీర్ఘంగా ఆతుకూరి ఆంజనేయులు అధ్యక్షునిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. వ్యాపార వర్గాలు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారంలో చూపిన చొరవ, విపత్కర పరిస్థితుల్లో ఛాంబర్ నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహించిన ఆంజనేయులు ఈసారి కొత్తవారికి అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ప్రస్తుత ఎన్నికలకు దూరంగా ఉన్నారు. 28న ఛాంబర్ ప్రధాన కార్యాలయంలో ఉదయం 8.30 గంటలకు ఓట్ల నమోదు ప్రక్రియ మొదలై, సాయంత్రం 5 గంటలకు ముగియనుంది. ఆ సాయంత్రం ఓట్లు లెక్కించి అధ్యక్షుడు ఎన్నిక ప్రకటించనున్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

విశాలాంధ్ర- గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి ఈ నెల 23వ తేది ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఛాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్(0863-2224202) కార్యక్రమం నిర్వహిస్తున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని తెలిపారు.

27లోపు అభ్యంతరాలు తెలియజేయాలి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కొత్తగా గుంటూరు జిల్లాలో ఏర్పాటు చేయనున్న స్కూల్ కాంప్లెక్స్ సముదాయాల వివరాల ఉత్తర్వులు, జాబితాలను జిల్లాలోని అందరూ ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు తమ కార్యాలయాలలో ప్రదర్శించాలని, దీనిపై ఏవైనా అభ్యంతరాలు, సలహాలు ఉంటే ఈ నెల 27వ తేదీలోపు జిల్లా విద్యాశాఖాధికారి, మండల విద్యాశాఖాధికారుల కార్యాలయాలలో నేరుగా అందించాలని లేదా ఈ నెల 23 నుంచి విద్యాశాఖ వెబ్‌సైట్ https://cse.ap.gov.in ద్వారా తెలియజేయడానికి అవకాశం ఉందని గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక ఒక ప్రకటనలో తెలియజేశారు.

పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలి

విశాలాంధ్ర-మంగళగిరి : రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి వీవీ జవహర్‌లాల్ అన్నారు. ఆదివారం రాత్రి మంగళగిరి సీపీఎం కార్యాలయంలో సీపీఎం పట్టణ కమిటీ సమావేశం ఎం.బాలాజీ అధ్యక్షతన జరిగింది. జవహర్ లాల్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఎన్నికలకు ముందు టీడీపీ కూటమి పార్టీల నాయకులు అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచమని చెప్పారని అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదు నెలల్లోనే రూ.18 వేల కోట్లను సర్దుబాటు, ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై భారాలు మోపారని విమర్శించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా అంబేద్కర్ గురించి హేళన చేస్తూ మాట్లాడడం దారుణమని అన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించడానికి ఆయా శాఖలు పరిధిలో కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సీపీఎం గుంటూరు జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, సీనియర్ నాయకులు జేవీ రాఘవులు, పి.బాలకృష్ణ, పట్టణ కమిటీ సభ్యులు ఎం.చలపతిరావు, టి.శ్రీరాములు, ఎస్.గణేష్, జె.బ్రాహ్మణి, ఎం.చంద్రారావు, ఆర్.వేణు, కె.శ్రీనివాసరావు, పి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లిలో ఇస్లాం ధార్మిక సదస్సు

విశాలాంధ్ర-దాచేపల్లి : స్థానిక మసీదు ప్రాంగణాల్లో ఆదివారం ఇస్లాం ధార్మిక సదస్సు నిర్వహించారు. నూర్, అక్సా, జామియా, ఉమర్, మర్కస్, రహమానియా మసీదుల పరిధిలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మత పెద్దలు పాల్గొని ప్రసంగించారు. ఈ సదస్సులో ముస్లిం విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

మండల స్థాయిలోనూ 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)ను ప్రతి సోమ వారం మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్ర మాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నామని కలెక్టర్ అన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు, డివి జనల్ కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించుకోవచ్చని తెలిపారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు చెప్పారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు కలెక్టర్ అభినందన

విశాలాంధ్ర-దుగ్గి : జాతీయ వినియోగ దారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభచాటి విజేతలుగా నిలిచిన దుగ్గి విద్యార్థులను జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక అంశాల పట్ల అవగాహన కలిగి ఉండా లన్నారు. సామాజిక స్పృహను పెంచే పోటీల్లో ప్రతిభ చూపి విజేతలుగా నిలవడం అభినందనీయమన్నారు. పోటీల్లో ప్రథమ బహుమతి పి.చంద్రిక(గవర్నమెంట్ జూనియర్ కాలేజ్), ద్వితీయ బహుమతి డి.జీవ జయన్, వక్తృత్వ పోటీల్లో పి.హేమ(కేజీబీవి జూనియర్ కాలేజ్) ద్వితీయ బహుమతి, బి.మేఘన తృతీయ బహుమతి, ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన లిఖిత్, లక్ష్మీకుమారి తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు జ్ఞాపికలను బహుకరించారు. ఆర్వీఎస్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన పోటీల్లో విజేతలైన విద్యార్థు లను కేజీబీవీ ప్రిన్సిపల్ ఆకుల ఆశాజ్యోతి, పలువురు అధ్యాపకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ముస్తాబవుతున్న చర్చిలు

విశాలాంధ్ర-తాడికొండ : క్రిస్మస్ పర్వదినాన్ని పుర స్కరించుకుని మండ లంలో క్రైస్తవ చర్చిలు ముస్తాబవుతున్నాయి. వివిధ రంగులు, అలం కారాలతో చర్చిలను తీర్చి దిద్దుతున్నారు. ప్రధాన కూడళ్ళు, సెంటర్లు, చర్చిలు, ఇళ్ల వద్ద వివిధ రంగులతో డిజైన్లతో స్టార్లను ఏర్పాటు చేశారు. 2024కు వీడ్కోలు పలుకుతూ 2025కు స్వాగతం పలుకుతూ స్టార్లు వెలిశాయి. ఇప్పటికే అనేక చోట్ల సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రీస్తు పుట్టుకకు సంబంధించి నాటక, నాటికలను ప్రదర్శిస్తున్నారు. 24, 25 తేదీలలో క్రిస్మస్ ట్రీని ఆయా గ్రామాలలో ఊరేగిం చనున్నారు. గ్రామాలలో క్రిస్మస్ సందడి నెలకొంది. సుదూర ప్రాంతంలో ఉన్న ఉద్యోగులు వ్యాపారులు క్రిస్మస్ పండుగ సందర్భంగా స్వగ్రామాలకు చేరుకుంటు న్నారు. చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

డిపాజిట్లు దక్కవనే వైసీపీ ఎన్నికల బహిష్కరణ: జీవీ

విశాలాంధ్ర - వినుకొండ : అయిదేళ్ల అధికారంలో చేసిన పాపాలకు ప్రజలు డిపాజిట్లు కూడా ఇవ్వరనే భయంతోనే వైకాపా ఎన్నికలు బహిష్కరిస్తోందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఎద్దేవా చేశారు. ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికలే కాదు 2029 పోరులోనూ జగన్ పార్టీ ఇంటికే పరిమితం కావడం ఖాయ మని స్పష్టం చేశారాయన. ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపు తథ్యమన్నారు. గుంటూరు ఏటుకూరు రోడ్డులోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం ఉమ్మడి గుంటూరు జిల్లా పట్టభద్రుల ఆత్మీయ సమావేశం నిర్వ హించారు. కేంద్రమంత్రి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్, శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అను రాధ, ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, గల్లా మాధవి, నజీర్ అహ్మద్, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, బూర్ల రామాంజనే యులు, ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, వేపాడ చిరంజీవి రావు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్ర సాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ ఆలపాటి రాజాకు మంత్రిగా చేసిన అనుభ వంతో పాటు అనేక రైతు ఉద్యమాలు నడిపారన్నారు. విద్యా సంస్థలు నెలకొల్పి ఎంతోమందికి ఉపాధి అవకా శాలు కల్పించారని, అలా ఉద్యోగుల కష్టసుఖాలు తెలిసిన, నిరుద్యోగుల పట్ల గౌరవం ఉన్న వ్యక్తిని భారీ మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. లక్షలాది

గుంటూరులో ఉమ్మడి జిల్లా పట్టభద్రుల ఆత్మీయ సమావేశం

మందికి ఉద్యోగాలని చెప్పి మోసం చేసినందుకే మొహం చెల్లకనే జగన్ ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరించారన్నారు. తమకు పోటీగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న వ్యక్తులు జగన్ రెడ్డి పాలనలో తప్పులపై ఎమ్మెల్సీగా ఉండి ఏనాడైనా మాట్లాడారా? ఎందుకు ప్రశ్నించలేదో పట్టభద్రులంతా ఆలోచన చేయాలన్నారు. విజన్-2047తో స్వర్ణాంధ్రప్రదేశ్, ఐదేళ్లలో రాష్ట్రానికి రూ.20 లక్షల నుంచి 30 లక్షల కోట్ల పెట్టుబడులు, తద్వారా 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గ్రామాల్లో ఎప్పుడూ లేనిరీతిలో అభి వృద్ధి బాటలు వేస్తున్నారని చెప్పారు. మంత్రి లోకేష్ విదేశా లకు వెళ్లి లక్షలాది కోట్ల పెట్టుబడులు తీసుకొస్తున్నారని, లక్షలాది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రాబోతున్నాయని తెలిపారు. వైకాపా పాలనలో ఉద్యోగాల్లేవు, పరిశ్రమల్లేవు, పెట్టుబడుల్లేవు, ఉపాధి అవకాశాల్లేవని, ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయలేదు, ప్రైవేటు సంస్థలను కక్షగట్టి రాష్ట్రం నుంచి వెళ్లగొట్టారని మండిపడ్డారు. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన తర్వాత లక్షలాది కోట్ల పెట్టుబడులు, ఉద్యోగాలు కూడా వస్తున్నాయన్నారు.

సీపీఐ శత జయంతి ఉత్సవాలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కారంపూడి : సీపీఐ శత జయంతి ఉత్సవాలను జయ ప్రదం చేయాలని మండల కార్యదర్శి షేక్ సైదా కోరారు. ఆదివారం ఆయన ఇంటివద్ద మాట్లాడుతు పేదల కోసం బడుగు బలహీన వర్గాల కోసం సన్న కారు చిన్న కారు రైతుల కోసం పుట్టిన పార్టీ సీపీఐ అని, అలాంటి పార్టీ ఇప్ప టికీ వంద సంవత్సరాలు పూర్తి చేసు కుని ఉత్సవాలకు సిద్ధంగా ఉంద న్నారు. స్వాతంత్ర పోరాటంలో ముం దుండి పోరాడిన పార్టీ అన్నారు. అలాగే కార్మికులు, కర్షకుల పక్షాన నిలబడి పోరాడిన పార్టీ అని, బడుగు బలహీన వర్గాలకు అండదండగా ఉండి వారి సంక్షేమం కోసం పాటు పడిన పార్టీ సీపీఐ అన్నారు. రజాకారు ఉద్యమంలో ముందుండి పోరాటం చేసిన పార్టీ అని అలాగే ఎన్నో ఒడిదు డుగులకు లోనై నిర్బంధాలను ఎది రించి పోరాడిందన్నారు. ఆ పార్టీ ఇప్పటికీ 99పూర్తి చేసుకుని 100వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా వాడవాడలా అరుణ పతా కాలతో విరజిల్లుతుందని ఆయన అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబి స్తున్న తరుణంలో వాటిపై ముందుండి పోరాటం చేస్తుందన్నారు. కావున సీపీఐ శత జయంతి ఉత్స వాలు కారంపూడిలో ఘనంగా నిర్వహించుటకు అందరూ కలసి రావాలని కోరారు. డిసెంబర్ 26న పట్టణంలో జరిగే ప్రదర్శనను ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి సూరె హనుమంత రావు, పెద్ద కొదమగుండ్ల కార్యదర్శి మేకపోతు చిన్నకోటిరెడ్డి, ఒప్పిచర్ల కార్యదర్శి ఇందూరు శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఏకే నాగమణి పాల్గొన్నారు.

అబ్దుల్ కలామ్ పురస్కారం అందుకున్న మౌనికశ్రీ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : డాక్టర్ చివుకుల హనుమం తరావు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో స్థానిక హిందూ ఇంజనీ రింగ్ కళాశాలలో జరిగిన పుర స్కార ప్రధానోత్సవ కార్యక్రమం లో మౌనికశ్రీ 'కలామ్ ఇన్‌స్పైరే షనల్ అవార్డ్' అందుకుంది. సుగుణ సైన్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చివుకుల హనుమంతరావు, సెక్రటరీ పత్రి వేణుగోపాల్ ఆధ్వర్యంలో అనేక రాష్ట్రాల నుంచి వివిధ రంగాలలో ప్రతిభావంతులైన ఉపాధ్యా యులు, విద్యార్థులను గుర్తించి ప్రతి సంవత్సరం పురస్కా రాలను అందిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నారు. మౌనికశ్రీ ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాలలో జ్ఞాపకశక్తిలో 52 రికార్డులు, 178 అవార్డులు, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అందుకుంది. తెలంగాణ ప్రభుత్వ అవార్డుతో పాటు ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకుంది. ఈ కార్యక్రమంలో కాటూరి వెంకటేశ్వర్రావు, సీహెచ్ నాగేశ్వరరావు, చెరువు రామకృష్ణమూర్తి పాల్గొన్నారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలు జయప్రదం చేయాలి: కాశయ్య

విశాలాంధ్ర-తాడేపల్లి : ఈ నెల 26న దేశవ్యాప్తంగా జరిగే సీపీఐ శతాబ్ది ఉత్సవాలను తాడేపల్లి వ్యాప్తంగా జయప్రదం చేయా లని సీపీఐ మంగళగిరి నియోజ కవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య కోరారు. ఆదివారం సాయం త్రం తాడేపల్లి సీతానగరంలో శీలం శ్యామ్ అధ్యక్షతన వారి ఇంటి సీతాన గరం శాఖ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సీపీఐ నియోజకవర్గ స్థాయి కార్యదర్శి కంచర్ల కాశయ్య, తాడేపల్లి పట్టణ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంక టయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతానగరం ప్రాం తంలో నివాసం ఉంటున్న పేదలకు ఉన్నచోటనే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇళ్ళు లేని నిరుపేదలకు పట్టణంలోనే రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరా రు. రాష్ట్రంలో పెంచిన విద్యు త్ చార్జీలు ట్రూఫ్ అఫ్ చార్జీ లు తగ్గించాలని కోరారు. ఈ నెల 26వ తేదీన జరిగే సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు మాణిక్యాలరావు, అనిల్ కుమార్, ప్రేమ్ కుమార్, లక్ష్మణ, రాజు బి.శివ, ప్రశాంత్, వెంక టేశ్వరమ్మ, పేరంటలు, ఎస్.రాజు, ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులకు రోడ్ టెస్ట్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో వాహన సామర్థ్యం, క్వాలిటీ మెరుగుపరచు నిమిత్తం ప్రతి రోజు గ్యారేజీలో మెకా నికల్ ఇంజనీరింగ్ విభాగ నిర్ణయాల ప్రకారము బస్సు లకు షెడ్యూల్ 3/4 మెయింటెనెన్స్ పరిశీలించడంలో భాగంగా ఆదివారం గుంటూరు-2 డిపోలో షెడ్యూల్-3 మెయింటెనెన్స్ చేయబడిన బస్సును గుంటూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.రవికాంత్ స్వయంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో జిల్లా ప్రజా రవాణా అధికారి రవి కాంత్, డీప్రెసీఎంఈ సత్యనారాయణ, గుంటూరు-2 డిపో మేనేజరు అబ్దుల్ సలామ్, గుంటూరు-2 డిపో మెకానికల్ సూపర్‌వైజర్లు, మెకానికల్ సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. షెడ్యూల్-3 మెయింటెనెన్స్ చేయబడిన బస్సులో రోడ్ టెస్ట్‌కు వెళ్లారు. రవికాంత్ మాట్లాడుతూ ప్రయాణీకులకు మెరుగైన బస్సులను ఏర్పాటు చేసే విష యంలో సంస్థ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగ నిర్ణ యాల ప్రకారం ప్రతి రోజు షెడ్యూల్ 3/4 మెయిం టెనె న్స్ చేయబడిన బస్సులను డిపో మేనేజరు, మెకానికల్ సూపర్‌వైజర్లు, సంస్థలోని ఉన్నతాధికారులు స్వయంగా తనిఖీ చేయడం, సదరు బస్సులకు రోడ్ టెస్ట్ నిర్వహి స్తారన్నారు. తద్వారా పరిశుభ్రమైన, మెకానికల్ లోపాలు లేని బస్సులను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

అమ్మవారి ఆశీస్సులు జగన్‌కు ఉండాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అమ్మవారి ఆశీస్సులు జగన్‌మోహన్ రెడ్డికి అన్నివేళలా ఉండాలని, రానున్న ఎన్నికల్లో కచ్చితంగా ముఖ్యమంత్రి అయ్యే తీరాలని ఆ అమ్మను కోరినట్లు వైఎస్సార్‌సీపీ గుంటూరు తూర్పు నియో జకవర్గ ఇన్‌చార్జ్ షేక్ నూరిఫాతిమా తెలిపారు. ఆదివారం తూర్పు నియోజకవర్గంలోని 14వ డివిజన్ డీఎస్ నగర్‌లో చిన్న అంకమ్మ తల్లి దేవస్థానంలో వైసీపీ నాయకులు గుదే నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన భవానీ స్వాముల పాల పొంగళ్ల నైవేద్య కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న అంకమ్మ తల్లీ దేవస్థానంలో ప్రతి ఏటా నిర్వహించే పాల పొంగళ్ల నైవేద్య కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతృప్తినిచ్చిందని ఆమె అన్నారు. అమ్మవారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలకు ఉండాలన్నారు. అలానే రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డి మరల సీఎం అవ్వాలని కోరినట్లు ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాజు, ముక్కంటి, రాజా, బాలయ్య, పల్లె శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవత్వాన్ని మేల్కొల్పిన మహనీయుడు యేసుక్రీస్తు

అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

క్రీస్తు బోధనలు ఆదర్శనీయం : ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ

ఐవీఎం ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

పేద విద్యార్థులకు, పేదలకు, దివ్యాంగులకు ఐవీఎం సహాయం

విశాలాంధ్ర-చల్లపల్లి : మనిషిలోని మృగత్వాన్ని పారద్రోలి మానవత్వాన్ని మేల్కొల్పిన మహనీయుడు యేసుక్రీస్తు అని స్థానిక శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం చల్లపల్లి మండలం పురిటిగడ్డలో ఐవీఎం కార్యాలయంలో ఐవీఎం ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్ ఆధ్వర్యంలో "ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ క్రిస్మస్ వేడుకలు" ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ క్రీస్తు బోధనల ఫలితంగానే ప్రపంచం శాంతి సహనంతో జీవిస్తోందన్నారు. అణు యుద్ధపు అంచుల్లో ఉన్న ప్రపంచాన్ని క్రీస్తు బోధనలే కాపాడుతున్నాయన్నారు. సౌమ్యులు ధన్యులు – శాంతిని స్థాపించువారు ధన్యులని క్రీస్తు బోధించారని, క్రీస్తు బోధనలు పాటిస్తే సమాజం సమున్నతంగా ఉంటుందన్నారు. ఏసుక్రీస్తు బోధించిన సహాయ గుణాన్ని అందిపుచ్చుకుని ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ స్థాపించిన డాక్టర్ వేములపల్లి సురేష్ – రోజా దంపతులు దశాబ్దాలుగా ఎంతోమంది పేద విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దారని తెలిపారు. ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ సంస్థ ద్వారా వేములపల్లి సురేష్ – రోజా దంపతులు ఈ ప్రాంత పేదలకు అండగా నిలుస్తున్న తీరు స్ఫూర్తిదాయకం అన్నారు. విపత్తులు సంభవించినపుడు ఐవీఎం సురేష్ – రోజా దంపతులు ప్రజలకు అండగా నిలిచే తీరు ఆదర్శనీయమన్నారు. కరోనాలో వేలాది మందికి నిత్యావసర సరుకులు, ఫ్రంట్ లైన్ వారియర్లకు కోవిడ్ కంట్రోల్ కిట్స్ లక్షలాది రూపాయలతో సమకూర్చారన్నారు. ఇటీవల కృష్ణానదికి వరదలు వచ్చిన సమయంలో సురేష్ కెనడా పర్యటనలో ఉన్నప్పటికీ తాను ఇక్కడి వరద బాధితుల పరిస్థితి చెప్పిన వెంటనే తన సతీమణి రోజా ద్వారా లక్షలాది రూపాయలు వెచ్చించి వేలాది మంది వరద బాధితులకు నిత్యావసర సరుకులు, నూతన వస్త్రాలు, దుప్పట్లు అందచేసినట్లు తెలిపారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ మాట్లాడుతూ ఏసు క్రీస్తు బోధించిన క్షమాగుణం ఎంతో మహోన్నతం అన్నారు. ఐవీఎం సురేష్ – రోజా దంపతుల సేవలు స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ సందర్భంగా అతిథుల చేతులమీదుగా 12 మంది పేద విద్యార్థులకు రూ. 3లక్షల అరవై వేల ఐవీఎం స్కాలర్ షిప్ అందచేశారు. రూ.ఇరవై వేల వ్యయంతో చల్లపల్లి మండలం పాగోలు శివారు మేకావారిపాలెంకు చెందిన కేసాని నాగమల్లేశ్వరరావుకు వీల్ ఛైర్, పాగోలుకు చెందిన పైడిపాముల వెంకయ్యకు ట్రై సైకిల్ అందచేశారు. 110 మంది ఐవీఎం విద్యార్థులకు క్రిస్మస్ బహుమతులు అందచేశారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ క్రిస్మస్ కేక్ కట్ చేసి పంచిపెట్టి శుభాకాంక్షలు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు, క్యాండిల్ సర్వీస్ నిర్వహించారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు నూతన వస్త్రాలు అందచేశారు. సంస్థ సిబ్బందికి బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, షేక్ నబీఖోరీ, విశ్రాంత డీఎస్పీ కే.హరి రాజేంద్రబాబు, సంస్థ ప్రతినిధులు వేములపల్లి విజయ, సోఫీ, జీ.ప్రసాద్, ఎన్.ఫణి పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక శ్రీకాళ హస్తి కాలనీలోని గ్రేస్ ఇమ్మాన్యుయేల్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఆదివారం పాస్టర్ వేసపోగు విజయబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి నాయకులు దేవరపల్లి వినయ్ బాబు, మురళి, పిచ్చయ్యలు పాల్గొని క్రిస్మస్ కేకును క్యాండి ల్స్‌న్ వెలిగించి దుస్తులను పంపిణి చేశారు. చిన్నారుల నాటికలు, యాక్షన్ సాంగ్స్ ను క్రీస్తు జనన ముపై ప్రదర్శించారు. ఈ సందర్భంగా దేవరపల్లి వినయ్‌బాబు మాట్లాడుతూ విజయబాబు ఈ ప్రాంతంలోనే కాకుండా లవ్ అండ్ కంపాషన్ మినిస్ట్రీస్ వేశపోగు జాకబ్ మెమోరియల్ చర్చ్ సభ్యులు ఇటీవల కాకినాడలోని కుష్టి వ్యాధి గ్రస్తుల కాలనీలో వస్త్రాలను బహూకరిం చడం జరిగిందన్నారు. ఇలాంటి సేవా కార్యక్ర మాలను నిర్వహిస్తు పేదలను ఆదుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సేవకులు సెంద్రపాటి జోసెఫ్, పాస్టర్ జాక్టిమ్, జాక్‌బ్రైట్‌రాయ్, కొమ్మల బబులు, వినుకొండ వరకుమార్, కాలేబు, పాల్గొన్నారు.

మందు ప్రియులకు శుభవార్త

విశాలాంధ్ర-అవనిగడ్డ : రాష్ట్రంలోనిమందుబాబులకు కూటమి ప్రభుత్వం నూతన సంవత్సర సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ శుభవార్త అందించింది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తక్కువ ధరలకు నాణ్యమైన మద్యాన్నిఅందుబాటులోకి తీసుకువస్తానని కూటమి పార్టీలు హామీల ఇచ్చిన విషయం తెలిసిందే. సుమారు పదకొండు మద్యం తయారీకంపెనీలు బేసిక్ ధరలను తగ్గించారు. దీనితో సదరు కంపెనీల నుంచి రాష్ట్ర బేవరేజెస్ సంస్థ లిక్కర్ కొనే రేటు తగ్గినది కారణంగా పలు బ్రాండ్ల మద్యం ఒక్కో కోటర్ ధర ఎంఆర్పి పై రూ. 30ల వరకు తగ్గుతుంది ఇది మద్యం ప్రియులకు సంతోషాన్ని ఇచ్చే విషయం అనేచెప్పవచ్చు ఇక లిక్కర్ ధరల విషయంలో సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడ అయినా ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి ఎక్కువ ధరకు అమ్మిన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

బీసీలు ఏకం కావాలి

విశాలాంధ్ర - విజయవాడ లబ్బీపేట : బీసీలు బార్న్ క్రియేటర్స్ అని చెప్పుకోవాలని, వారందరూ కరుణానిధి స్ఫూర్తితో ఏకమైతేనే వారికి రాజకీయ మనుగడ, తమిళనాడు తరహాలో అన్నివిధాలుగా ప్రాధాన్యత సాధించుకోగలరని, బహుజన సమాజ్ పార్టీ ఏపీ స్టేట్ కోఆర్డినేటర్, రిటైర్డ్ డీజీపీ డా జుజ్జవరపు పూర్ణచంద్రరావు పిలుపు నిచ్చారు. శనివారం విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ బీసీ మేధావుల వేదిక స్థాపనకు సన్నాహకంగా జరిగిన కార్యక్రమంలో అయన ఈ విధంగా అన్నారు. బీసీల్లోని ఒకటి రెండు కులాల మీద ఇతర బీసీ వర్గాలకు ద్వేషం రగిల్చేలా రెండు కులాల పార్టీలు అనాదిగా వ్యవరిస్తు న్నాయని, దీనికి ఇటీవల సర్దార్ గౌతులచ్చన్న విగ్రహావిష్కరణ సందర్భంగా జరిగిన విషయమే ఉదాహరణ అన్నారు. సాక్షాత్తు సర్దార్ గౌతు లచ్చన్న మనవరాలిని, మరొక్క సీనియర్ బీసీ నాయకునికి తాకీదులిచ్చి బీసీల్లోనే చిచ్చుపెడుతున్నారన్నారు. గత 16 ఎన్నికల్లో కులాంధ్రప్రదేశ్ లో 10 శాతం ఉన్న కమ్మలు, రెడ్లు 2902 ఎమ్మె ల్యేలు, మరి 50 శాతం పైగా ఉన్న బీసీలు కేవలం 498 మంది మాత్రమే అయ్యారు. ఈ పరిస్థితిలో మార్పు కావాలంటే బీసీలు ఏకం కావాలి. ముందుగా మనం కూడా బీసీలమని గుర్తించాలి. ఈ రాష్ట్రా నికి బీసీలే వెన్నెముక అని చాటిచెప్పాలి. బీసీలు ఏకమైతేనే తమిళ నాడు తరహాలో అభివృద్ధి జరుగుతుంది. ఇందుకు కరుణానిధి స్ఫూర్తితో మనమందరం ముందుకెళ్లాలన్నారు. శటీ చిరంజీవులు రిటైర్డ్ ఐఏఎస్, బివి రమణకుమార్, ఎం.రవీంద్రనాథ్ బాబు - రిటైర్డ్ ఐపీఎస్ అధికారులు, బి రామారావు - రిటైర్డ్ ఐఏఎస్ ప్రముఖ పాత్రికేయులు, రచయిత అన్నవరపు బ్రహ్మయ్య పాల్గొన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బి పరంజ్యోతి, అమిత షా వెంటనే రాజీనామ చేయాలనీ, అప్పటివరకు బహుజన్ సమాజ్ పార్టీ పోరాడు తూనే ఉంటుందని అన్నారు. ఈ నెల 24వ తారీఖున బెహెన్జీ మాయావతి పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల న్నిటిలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలియజేశారు.

నగరంలో యుఐ చిత్ర యూనిట్ సందడి

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : విలక్షణ నటుడు దర్శకుడు ప్రముఖ హీరో ఉపేంద్ర సందడి చేశారు. యు ఐ సినిమా కథ 2040 సంవత్సరంలో ప్రపంచం ఎలా ఉంటుందో అనే అంశంపై ఆధారపడిందనీ చెప్పారు. ఈ సినిమాలో 'పగలు, రాత్రి' అనే కాన్సెప్ట్‌తో తెరకెక్కిందన్నారు. తమ చిత్రానికి ఇంతటి ఘన విజయాన్ని అందించినందుకు ప్రేక్షకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. యుఐ చిత్రం విజయోత్సవ యాత్రలో భాగంగా నోవాటెల్ హోటల్ నందు ఆచిత్ర యూనిట్ మీడియా సమావేశం నిర్వహించారు. చిత్ర కథానాయకుడు దర్శకుడు విలక్షణ నటుడు ఉపేంద్ర మాట్లాడుతూ యు ఐ 'సినిమా కథ 2040 సంవత్సరంలో ప్రపంచం ఎలా ఉంటుందో అనే అంశంపై ఆధారపడిందనీ చెప్పారు. ఈ సినిమాలో 'పగలు, రాత్రి' అనే కాన్సెప్ట్‌తో తెరకెక్కిందన్నారు. ప్రతి ఒక్కరి కృషి సినిమాను ఉత్కంఠభరితంగా మార్చడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. తమ చిత్రం కోవిడ్19, ఏఐ, గ్లోబల్‌వార్మింగ్, యుద్ధాలు మరియు సోషల్ మీడియాతో నిండిన 2040 డిస్టోపియన్ ప్రపంచంలోకి వీక్షకులను తీసుకువెళ్లిందనీ తమ చిత్రానికి ఇంతటి ఘన విజయాన్ని అందించినందుకు ప్రేక్షకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలుగు ప్రేక్షకులు తమ చిత్రానికి బ్రహ్మరథంపడుతున్నారని తెలియజేశారు. తెలుగులో మల్టీస్టారర్ చిత్రం చేయడానికి ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు. అనంతరం చిత్ర నిర్మాత నవీన్ మనోహర్ మాట్లాడుతూ తెలుగు ప్రేక్షకులు యుఐ చిత్రాన్ని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేసేందుకు విజయవాడ రావడం జరిగిందన్నారు. తమ చిత్రం విడుదలకు ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్ సహకారం మరువలేనిదని పేర్కొన్నారు.

నగరంలో మ్యూజిక్ డైరెక్టర్ మణిశర్మ సందడి

విశాలాంధ్ర విజయవాడ లబ్బీపేట : నగరంలో ప్రముఖ సినీ మ్యూజిక్ డైరెక్టర్ మణిశర్మ సందడి చేశారు. మ్యూజిక్ డైరెక్టర్ మణిశర్మ విజయవాడ నగరంలోని ఓ ప్రముఖ హోటల్ నందు మీడియా సమావేశం నిర్వహించారు. విజయవాడ వేదికగా డిసెంబర్ 31న తన లైవ్ ప్రోగ్రాంను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.సంగీత దర్శకుడు గా 27 సంవత్సరాలు పూర్తి చేసుకున్నాననీ,విదేశాలలో అనేక ప్రదర్శనలు ఇచ్చాననీ తెలిపారు.ఇప్పటి వరకు 230 చిత్రాలు చేశాననీ చెప్పారు.మొట్టమొదటి సారిగా విజయవాడలో ఈ నెల 31న భవానిపురం, బబ్బురి గ్రౌండ్స్‌లో లైవ్ ప్రోగ్రాం చేస్తున్నానని వెల్లడించారు. తనకు ఇళయరాజా మ్యూజిక్ ఇష్టమని, తాను చేసిన సినిమాల్లో ఒక్కడు మూవీ చాలా ఇష్టమని తెలిపారు. గతంలో అనేకమంది విజయవాడలో లైవ్‌షో చెయ్యమన్నారు అవ్వలేదనీ చెప్పారు. ఇప్పుడు కుదిరింది. విజయవాడ వేదికగా డిసెంబర్ 31న తన లైవ్ ప్రోగ్రాంను నిర్వహించడం చాల సంతోషంగా ఉందన్నారు. అనంతరం ప్రోగ్రామ్ డైరెక్టర్ శంకర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ టూరిజం శాఖ సహకారంతో బొబ్బూరి గ్రౌండ్స్‌లో మణిశర్మ లైవ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథులుగా విచ్చేయున్నారని తెలియజేశారు. సినీ సంగీత ప్రియులను అలరించేందుకు ప్రముఖ హీరోయిన్ ముమైత్ ఖాన్, సిని నేపధ్య గాయని మధుప్రియ, ప్రముఖ యాంకర్ ఉదయభాను విచ్చేయనున్నారని వివరించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక విద్యావికాస్ ఇంగ్లీషు మీడియం బ్లూమ్స్, ప్రైమరీ, హైస్కూల్ శనివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను విద్యావికాస్ డైరెక్టర్స్ ముపాళ్ళ సుబ్బారావు, కొమ్మినేని సాంబశివ రావులు కట్ చేసి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారు వివిధ నాటికలు, నృతులు, పాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.